https://siddipettimes.com

# సిద్దిపేట టైమ్స్

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 | సంచిక -350 | తెలంగాణ | గురువారం | తేదీ: 28.05.2026 | ఎడిటర్ : మదూరి శ్రీరామ్ | పేజీలు 8 | వెల రూ.3



## అర్హులైన పేదలందరికీ దశలవారీగా పక్కా ఇళ్లు : మంత్రి శ్రీధర్‌బాబు

2లో..



# గ్రామాల్లో డిజిటల్ విప్లవం

- కేంద్ర మంత్రి సింధియాతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ
- తెలంగాణ గ్రామీణ ప్రాంతాలకు నిరంతర హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ
- అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ కింద టీ-ఫైబర్ ప్రాజెక్టుపై వీడియో కాన్ఫరెన్స్
- పెండింగ్ నిధుల విడుదల, రింగ్ ఆర్కిటెక్చర్ వ్యవస్థపై కేంద్రం సానుకూలత

2లో..

సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 27 :
తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలకు నిరంతరం హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీని అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ సజావుగా అమలు చేయడానికి ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి కొన్ని కీలక అంశాలను కేంద్ర సమాచార శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా దృష్టికి తీసుకెళ్లారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ముఖ్యమంత్రి గురువారం సచివాలయం నుంచి కేంద్ర మంత్రితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ప్రోగ్రామ్‌కు సంబంధించి సాధ్యమైనంత తొందరగా ఒప్పందాన్ని కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధులను సత్వరం విడుదల చేయడం వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి నాణ్యమైన హై-స్పీడ్ ఇంటర్నెట్ అందించాలనే తెలంగాణ దార్శనికతను సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వివరించారు. మండలం నుండి గ్రామ పంచాయతీ రింగ్ నెట్‌వర్క్ వ్యవస్థలను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేయడంపై స్పష్టమైన విధానం ఉండాలని కేంద్ర మంత్రిని కోరారు.



# మహిళా సమాఖ్యల చరిత్రలో సరికొత్త మైలురాయి

- మెగావాట్ సోలార్ ప్లాంట్ ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి
- దేశంలోనే తొలిసారిగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఒక మెగావాట్ సౌర విద్యుత్ కేంద్రం ఏర్పాటు
- ఖమ్మం జిల్లా వెంకటాపురంలో మంత్రి సీతక్కతో కలిసి సోలార్ ప్లాంట్ ప్రారంభించిన భట్టి విక్రమార్క
- మహిళా సంఘాలకు రుణ పరిమితి రూ. 10 లక్షలకు పెంపు; రూ. 10 కోట్ల చెక్కుల పంపిణీ


2లో..

సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 27 :
రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ఒక మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఒక మెగావాట్ సామర్థ్యం గల సౌర విద్యుత్తు కేంద్రాన్ని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం వెంకటాపురంలో రూ. 3 కోట్లతో నిర్మించిన ఈ సౌర విద్యుత్తు కేంద్రాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి శీతక్కతో కలిసి ఆయన గురువారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ మహిళల స్వయం ఉపాధిని ప్రోత్సహించేలా రూ. 1.30 కోట్లతో నిర్మించనున్న పెట్రోల్ బంక్‌కు కూడా డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు.

## మ్మిడిహెట్టి ఎత్తుపై మహారాష్ట్రతో చర్చలు

- సీఎం రేవంత్ రెడ్డి కీలక లేఖ
- తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపుపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ
- తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృంద సమావేశానికి సమయం కోరిన ముఖ్యమంత్రి
- ఎఫ్‌ఆర్‌ఎల్ పెంచితే ఉత్తర తెలంగాణకు గ్రావిటీ ద్వారా నీరందే అవకాశం

2లో..





# అప్పుల బాధకు కుటుంబం బలి!

- ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య
- మృతుల్లో భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు
- మామిడి తోటలో భార్య, ఇద్దరు పిల్లలను సంపులో పడేసి తాను ఉరివేసుకొని ఆత్మహత్య
- సలికెలపురంలో ఘోరం
- దోకూర్ లో విషాదం

2లో..


సిద్దిపేట టైమ్స్, దేవరకద్ర (వనపర్తి), మే 27 :
ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అప్పుల బాధకు ఓ కుటుంబం బలైపోయింది. విధి ఆడిన నాటకంలో ఆ కుటుంబం పావైంది. ఆడుతూ పాడుతూ ఆనందంగా గడుపుతున్న ఆ కుటుంబాన్ని చూసి విధి ఓరువలేకపోయింది.అప్పుల బాధ తట్టుకోలేక ఓ వ్యక్తి భార్య, తన ఇద్దరు పిల్లలను సంపులో పడేసి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని వనపర్తి జిల్లా ఖిల్లా గణపురం మండల పరిధిలోని సలికేలపురంలో ఈ విషాదకర సంఘటన చోటుచేసుకుంది. మృతుల కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం...

# ఓటరు జాబితాల సవరణపై ఈసీకి క్లీన్‌చిట్

- సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు
- ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) రాజ్యాంగబద్ధమేనని స్పష్టం చేసిన సర్వోన్నత న్యాయస్థానం
- ఓటర్ల జాబితా లేదా ఆధార్ కార్డ్ దేశ పౌరసత్వాన్ని నిర్ధారించే చట్టబద్ధమైన పత్రాలు కావని వెల్లడి
- వీవీప్యాట్ రసీదులపై ఓటింగ్ సమయం ముద్రించే అంశాన్ని పరిశీలించాలని ఎన్నికల సంఘానికి ఆదేశం

2లో..

ఢిల్లీ : ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కసరత్తుపై జరిగిన సుదీర్ఘ న్యాయపోరాటంలో కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీ) సుప్రీంకోర్టులో భారీ విజయం లభించింది. బిహార్‌లో ఈసీ చేపట్టిన 'సర్' కసరత్తు పూర్తిగా రాజ్యాంగబద్ధమేనని, ఆ ప్రక్రియను నిర్వహించే పూర్తి అధికారం ఎన్నికల సంఘానికి ఉందని సర్వోన్నత న్యాయస్థానం బుధవారం తేల్చిచెప్పింది.





# అకాల వర్షాలతో తడిసిన ధాన్యం

- కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల కన్నీరు
- రాష్ట్రవ్యాప్తంగా వరుసగా కురిసిన భారీ వానలు
- చెరువులను తలపించిన కొనుగోలు కేంద్రాలు
- టార్పాలిన్ల కొరత, రవాణా జాప్యమే శాపంగా మారిన వైనం
- రోడ్లపైకి చేరిన రైతుల నిరసనలు
- తడిచిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్న అధికారులు
- తక్షణ కొనుగోళ్లకు డిమాండ్

2లో..

సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 27 :
తెలంగాణలోని అన్నదాతలపై ప్రకృతి పగబట్టింది. వరుసగా రెండు రోజుల పాటు కురిసిన అకాల వర్షా లు రైతాంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, మహబూబ్‌నగర్ సహా పలు జిల్లాల్లో మంగళవారం అర్ధరాత్రి, బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షా లకు ధాన్యం కల్లాలు, కొనుగోలు కేంద్రాలు చిన్నపాటి చెరువులను తలపించాయి.

# ఎండలకు జాగ్రత్తలు పాటించండి



- తీవ్ర ఉష్ణోగ్రతల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ సూచన
- పిల్లలు, వృద్ధులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే వారిపై వడదెబ్బ ప్రభావం ఎక్కువ
- నిరంతరం నీరు తాగుతూ ఉండాలని, మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లవద్దని విజ్ఞప్తి

ఢిల్లీ : దేశవ్యాప్తంగా ఎండలు మండిపోతున్న నేపథ్యంలో ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ఈ కఠిన వాతావరణ పరిస్థితుల్లో గరిష్ఠ జాగ్రత్తలు పాటించడం ఎంతో ఆవశ్యకమని ఆయన పేర్కొన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకున్న తరుణంలో బుధవారం ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా దేశ ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు.

2లో..

# ఫామ్‌హౌస్‌లో సీన్ రీకన్‌స్ట్రక్షన్



- భగీరథ్ ను ఫామ్‌హౌస్‌కు తీసుకువెళ్లి క్రైమ్ సీన్ పునర్నిర్మించిన పేట్‌బషీరాబాద్ పోలీసులు
- నిందితుడి స్నేహితుల విచారణ
- బాధితురాలు, తల్లి స్టేట్‌మెంట్ల ఆధారంగా దర్యాప్తు
- చర్లపల్లి జైలు నుంచి మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించిన మల్కాజ్‌గిరి కోర్టు

2లో..

సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 27 :
పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. బుధవారం అతడిని మొయినాబాద్ మండలంలోని అరణ్య ఫామ్‌హౌస్‌కు తీసుకువెళ్లి క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఈ కేసులో మరింత సమాచారాన్ని సేకరించేందుకు పోలీసులు ఇప్పటికే బండి భగీరథ్ నలుగురు స్నేహితులను క్షుణ్ణంగా ప్రశ్నించారు.

https://siddipettimes.com
సిద్దిపేట టైమ్స్
తెలుగు దినపత్రిక
గురువారం, హైదరాబాద్
28-05-2026
http://siddipettimes.com

# ఓటరు జాబితాల సవరణపై ఈసీకి క్లీన్‌చిట్

**-సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు**
**-ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) రాజ్యాంగబద్ధమేనని స్పష్టం చేసిన సర్వోన్నత న్యాయస్థానం**
**-ఓటర్ల జాబితా లేదా ఆధార్ కార్డ్ దేశ పౌరసత్వాన్ని నిర్ధారించే చట్టబద్ధమైన పత్రాలు కావని వెల్లడి**
**-వీవీప్యాట్ రసీదులపై ఓటింగ్ సమయం ముద్రించే అంశాన్ని పరిశీలించాలని ఎన్నికల సంఘానికి ఆదేశం**

**ఢిల్లీ :** ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కసరత్తుపై జరిగిన సుదీర్ఘ న్యాయపోరాటంలో కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీ) సుప్రీంకోర్టులో భారీ విజయం లభించింది. బిహార్‌లో ఈసీ చేపట్టిన 'సర్' కసరత్తు పూర్తిగా రాజ్యాంగబద్ధమేనని, ఆ ప్రక్రియను నిర్వహించే పూర్తి అధికారం ఎన్నికల సంఘానికి ఉందని సర్వోన్నత న్యాయస్థానం బుధవారం తేల్చి చెప్పింది. చట్టాలను ఈసీ అతిక్రమించిందంటూ దాఖలైన పిటిషన్లలోని వాదనలను పూర్తిగా తిరస్కరిస్తూ 124 పేజీల సుదీర్ఘ తీర్పును వెలువరించింది. రాష్ట్రాలలో ఈ ప్రత్యేక సవరణ చేపట్టాల్సిన ఆవశ్యకతపై ఎన్నికల సంఘం సమర్పించిన వివరణలను, బలమైన కారణాలను న్యాయస్థానం ఏకీభవించింది. నిష్పక్షపాతంగా, స్వేచ్ఛగా, న్యాయబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలన్న రాజ్యాంగ ఆదేశాలను 'సర్' కసరత్తు ముందుకు తీసుకెళ్తుందని సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన ధర్మాసనం అభిప్రాయపడింది. ఓటరు జాబితాలో పేరును తొలగించినంత మాత్రాన సదరు వ్యక్తి దేశ పౌరసత్వాన్ని కోల్పోయినట్లు కాదని తీర్పులో స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా అనేది పౌరసత్వాన్ని నిర్ధారించే చట్టబద్ధమైన పత్రమేమీ కాదని, అలాగే ఆధార్ కార్డు కూడా దేశ పౌరసత్వానికి నిదర్శనం కాదని న్యాయస్థానం కీలక వ్యాఖ్యలు చేసింది. రాజ్యాంగ అధికరణం 324, ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 21(3) ప్రకారం.. ఓటరు జాబితాలకు ఇలాంటి ప్రత్యేక సవరణలు చేపట్టే సర్వాధికారాలు ఈసీకి దఖలుపడ్డాయని స్పష్టం చేస్తూ బిహార్ కసరత్తును సవాల్ చేసిన పిటిషన్లను తోసిపుచ్చింది. పట్టణీకరణ, భారీ వలసలు, అలాగే దేశంలో సమగ్ర ఓటరు జాబితా సవరణ చేపట్టి రెండు దశాబ్దాలు గడవటం వంటి కారణాల రీత్యా 'సర్' నిర్వహణ అనివార్యమన్న ఈసీ వాదనపై ధర్మాసనం సంతృప్తి వ్యక్తంచేసింది. సాధారణ ఓటర్ల జాబితా సవరణ కంటే ఇది భిన్నంగా ఉన్నంత మాత్రాన కొట్టివేయలేమని, ప్రారంభంలో ఎక్కువ మంది పేర్లు తొలగినట్లు కనిపించినా తగిన రక్షణ చర్యల ద్వారా దీనిని రాజ్యాంగబద్ధంగా నిర్వహించవచ్చని తెలిపింది. అయితే, ఈ దేశ పౌరులు కాదనే అభిప్రాయంతో ఓటరు జాబితా నుంచి ఎవరి పేర్లనైనా తొలగించి ఉంటే, ఆ వ్యక్తుల వివరాలను పౌరసత్వాన్ని నిర్ధారించే అధికారిక యంత్రాంగానికి నాలుగు వారాల్లోగా పంపించాలని ఎన్నికల సంఘాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. మరోవైపు సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ తీర్పుతో విపక్ష కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా విభేదించింది. సర్ నిర్వహణకు సుప్రీంకోర్టు తీర్పు ప్రాథమికంగా చట్టబద్ధత కల్పించి ఉండవచ్చు కానీ, దాని నిర్వహణ వెనుక ఉన్న రాజకీయ దురుద్దేశాన్ని మాత్రం సరిదిద్దలేదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ అధికార ప్రతినిధి అభిషేక్ మను సింఘ్వీ విమర్శించారు. 'సర్'పై వ్యక్తమైన అభ్యంతరాలకు ఈ తీర్పు కొన్ని సమాధానాలు ఇస్తూనే, ప్రజాస్వామ్య వ్యవస్థలో అనేక కొత్త ప్రశ్నలను లేవనెత్తిందని అభిప్రాయపడ్డారు. ఈ కసరత్తును చేపట్టిన పద్ధతి, తీరు, సమయం మరియు శైలిని తమ పార్టీ ఎప్పటికీ ప్రశ్నిస్తూనే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఇదే సమయంలో, ఎన్నికల సమయం ముగిసిన తర్వాత కూడా పెద్దఎత్తున ఓట్లు నమోదు అవుతున్నాయనే ఆరోపణలపై సుప్రీంకోర్టు స్పందించింది. ఓటర్లు ఓటు వేసిన ఖచ్చితమైన సమయాన్ని ఓటు రసీదు యంత్రాల్లో (వీవీప్యాట్‌లపై) ముద్రించేలా నిబంధనల్లో మార్పు చేయాలని కోరుతూ భద్రాద్రికొత్తగూడెం జిల్లా పాల్వంచ నివాసి నల్లా సురేశ్‌రెడ్డి దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కేంద్ర ఎన్నికల సంఘానికి బదిలీ చేసింది. పిటిషనర్ సమర్పించిన ఈ విజ్ఞప్తిని ఒక అధికారిక విజ్ఞాపన పత్రంగా పరిగణనలోకి తీసుకుని, దీనిపై తగిన నిర్ణయం తీసుకోవాలని ఎన్నికల సంఘాన్ని న్యాయస్థానం నిర్దేశించింది.

# గ్రామాల్లో డిజిటల్ విప్లవం

**-కేంద్ర మంత్రి సింధియాతో సీఎం రేవంత్ రెడ్డి కీలక భేటీ**
**-తెలంగాణ గ్రామీణ ప్రాంతాలకు నిరంతర హై-స్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీ**
**-అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ కింద టీ-ఫైబర్ ప్రాజెక్టుపై వీడియో కాన్ఫరెన్స్**
**-పెండింగ్ నిధుల విడుదల, రింగ్ ఆర్కిటెక్చర్ వ్యవస్థపై కేంద్రం సానుకూలత**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 27 :**

తెలంగాణలోని గ్రామీణ ప్రాంతాలకు నిరంతరం హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ కనెక్టివిటీని అందించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్ సజావుగా అమలు చేయడానికి ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి కొన్ని కీలక అంశాలను కేంద్ర సమాచార శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య సింధియా దృష్టికి తీసుకెళ్లారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి ముఖ్యమంత్రి గురువారం సచివాలయం నుంచి కేంద్ర మంత్రితో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ ప్రోగ్రామ్‌కు సంబంధించి సాధ్యమైనంత తొందరగా ఒప్పందాన్ని కుదుర్చుకోవడం, పెండింగ్‌లో ఉన్న నిధులను సత్వరం విడుదల చేయడం వంటి అంశాలపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి నాణ్యమైన హైస్పీడ్ ఇంటర్నెట్



అందించాలనే తెలంగాణ దార్శనికతను సీఎం రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా వివరించారు. మండలం నుండి గ్రామ పంచాయతీ రింగ్ నెట్‌వర్క్ వ్యవస్థలను డిజిటల్ భారత్ నిధికి బదిలీ చేయడంపై స్పష్టమైన విధానం ఉండాలని కేంద్ర మంత్రిని కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనలపై కేంద్ర మంత్రి జ్యోతిరాదిత్య సింధియా సానుకూలంగా స్పందించారు. తెలంగాణ ఆశిస్తున్న లక్ష్యాన్ని సాధించడానికి, మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. అమెండెడ్ భారత్‌నెట్ ప్రోగ్రామ్‌లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ఒక స్పెషల్ పర్పస్ వెహికిల్ (SPV) ఏర్పాటు చేయనుంది. దీని ద్వారా కేంద్ర ప్రభుత్వంతో అధికారిక ఒప్పందం కుదుర్చుకోవడం జరుగుతుంది. తద్వారా రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా విస్తృతమైన హైస్పీడ్ నెట్‌వర్క్‌ను స్వతంత్రంగా అభివృద్ధి పరుచుకోవడానికి వీలుంటుంది. ఈ వ్యూహాత్మక భాగస్వామ్యం వల్ల క్షేత్రస్థాయిలో డిజిటల్ మౌలిక వసతుల కల్పన మరింత వేగవంతం కానుంది. రాష్ట్రంలో ఏకీకృత డిజిటల్ విధానం వల్ల టీఫైబర్ నెట్‌వర్క్‌ను విస్తరిస్తూ ప్రతి గ్రామ పంచాయతీని అనుసంధానిస్తూ 'రింగ్ ఆర్కిటెక్చర్'గా తీర్చిదిద్దాలని ప్రభుత్వం సంకల్పించింది. ఈ రింగ్ ఆర్కిటెక్చర్ సాంకేతికత ద్వారా ఒక మార్గంలో నెట్‌వర్క్‌కు ఏదైనా అంతరాయం ఏర్పడినా, ప్రత్యామ్నాయ మార్గం ద్వారా ఇంటర్నెట్ సేవలు నిరంతరం కొనసాగుతాయి. తద్వారా గ్రామీణ తెలంగాణకు ఎక్కడా బ్రేక్ పడకుండా హైస్పీడ్ బ్రాడ్‌బ్యాండ్ సేవలు అందుబాటులోకి వస్తాయి. భవిష్యత్తు అవసరాలకు సరిపడేలా ఈ ఫైబర్ నెట్‌వర్క్ మౌలిక సదుపాయాలను డిజైన్ చేస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా మొదటి దశలో, నెట్‌వర్క్ దెబ్బతిన్న ఉమ్మడి నిజామాబాద్, రంగారెడ్డి, ఖమ్మం జిల్లాల్లోని 3,089 గ్రామాలకు డిజిటల్ కనెక్టివిటీని పునరుద్ధరించనున్నారు. ఆ తర్వాత మిగిలిన ప్రాంతాలకు సమంగా హైస్పీడ్ నెట్‌వర్క్ సేవలను విస్తరిస్తారు. ఈ ఉన్నత స్థాయి వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణా రావు, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి. అజిత్ రెడ్డి, ఐటీ శాఖ జాయింట్ సెక్రటరీ డి. అనుదీప్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మహిళా సమాఖ్యల చరిత్రలో సరికొత్త మైలురాయి

**-మెగావాట్ సోలార్ ప్లాంట్ ప్రారంభించిన డిప్యూటీ సీఎం భట్టి**
**-దేశంలోనే తొలిసారిగా మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఒక మెగావాట్ సౌర విద్యుత్ కేంద్రం ఏర్పాటు**
**-ఖమ్మం జిల్లా వెంకటాపురంలో మంత్రి సీతక్కతో కలిసి సోలార్ ప్లాంట్ ప్రారంభించిన భట్టి విక్రమార్క**
**-మహిళా సంఘాలకు రుణ పరిమితి రూ. 10 లక్షలకు పెంపు; రూ. 10 కోట్ల చెక్కుల పంపిణీ**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 27 :**

రాష్ట్ర చరిత్రలోనే తొలిసారిగా ఒక మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఒక మెగావాట్ సామర్థ్యం గల సౌర విద్యుత్తు కేంద్రాన్ని ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని ఉప ముఖ్యమంత్రి శ్రీ మల్లు భట్టివిక్రమార్క పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం వెంకటాపురంలో రూ. 3 కోట్లతో నిర్మించిన ఈ సౌర విద్యుత్తు కేంద్రాన్ని మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి శీతక్కతో కలిసి ఆయన గురువారం అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామీణ మహిళల స్వయం ఉపాధిని ప్రోత్సహించేలా రూ. 1.30 కోట్లతో నిర్మించనున్న పెట్రోల్ బంక్‌కు కూడా ఉప ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ప్లాంట్ ప్రారంభోత్సవం అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రసంగించారు. ప్రజా ప్రభుత్వ వారోత్సవాలలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి 8 వేల మహిళా సమాఖ్య భవనాల నిర్మాణానికి శంకుస్థాపనలు చేసినట్లు వెల్లడించారు. గత పదేళ్ల కాలంలో అప్పటి భారాస ప్రభుత్వం మహిళా సంఘాల అభ్యున్నతిని, వారి అవసరాలను పూర్తిగా పట్టించుకోలేదని ఆయన విమర్శించారు. ప్రస్తుతం తమ ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలు అందిస్తుంటే, ఓర్వలేక ప్రతిపక్ష నేతలు నిందారోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. మహిళా సంఘాల ఆర్థిక స్వావలంబన కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందన్న భట్టి విక్రమార్క, గత రెండున్నరేళ్ల కాలంలోనే మహిళా సంఘాలకు ఏకంగా రూ. 66 వేల కోట్ల రుణాలను విజయవంతంగా పంపిణీ చేశామని వివరించారు. ఇదే స్ఫూర్తితో రానున్న మరో రెండున్నరేళ్ల కాలంలో రూ. 1.30 లక్షల కోట్ల వడ్డీలేని రుణాలను అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. మహిళలు వ్యాపార రంగాల్లో రాణించేందుకు వీలుగా మహిళా సంఘాల రుణ పరిమితిని రూ. 10 లక్షలకు పెంచినట్లు ఈ సందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు. మంత్రి సీతక్క మాట్లాడుతూ, కార్పొరేట్ దిగ్గజాలైన అదానీ, అంబానీలు ఏర్పాటు చేసే భారీ సోలార్ ప్లాంట్లకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రజా ప్రభుత్వంలో గ్రామీణ మహిళలు సౌర విద్యుత్తు కేంద్రాలు, పెట్రోల్ బంక్‌లను నిర్వహిస్తుండటం గర్వకారణమన్నారు. మహిళలు కేవలం గృహిణులుగానే కాకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదిగి ఆర్థికంగా బలోపేతం కావాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని పేర్కొన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో కలిసి వివిధ మహిళా సంఘాలకు రూ. 10 కోట్ల విలువైన ముందస్తు రుణాల చెక్కును ఆమె పంపిణీ చేశారు. ఈ ప్రతిష్టాత్మక గ్రామీణాభివృద్ధి కార్యక్రమంలో సెర్ప్ (SERP) సీఈఓ దివ్యా దేవరాజన్, పంచాయతీ రాజ్ శాఖ ప్రత్యేకాధికారి స్మితా సభర్వాల్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావుతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన మహిళా సమాఖ్య ప్రతినిధులు, ఉన్నతాధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎండలకు జాగ్రత్తలు పాటించండి

**-తీవ్ర ఉష్ణోగ్రతల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఎక్స్ వేదికగా ప్రధాని మోదీ సూచన**
**-పిల్లలు, వృద్ధులు, బహిరంగ ప్రదేశాల్లో పనిచేసే వారిపై వడదెబ్బ ప్రభావం ఎక్కువ**
**-నిరంతరం నీరు తాగుతూ ఉండాలని, మధ్యాహ్నం వేళల్లో బయటకు వెళ్లవద్దని విజ్ఞప్తి**



**ఢిల్లీ :** దేశవ్యాప్తంగా ఎండలు మండిపోతున్న నేపథ్యంలో ప్రజలందరూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సూచించారు. ఈ కఠిన వాతావరణ పరిస్థితుల్లో గరిష్ఠ జాగ్రత్తలు పాటించడం ఎంతో ఆవశ్యకమని ఆయన పేర్కొన్నారు. దేశంలోని పలు ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకున్న తరుణంలో బుధవారం ఆయన ఎక్స్ (ట్విట్టర్) వేదికగా దేశ ప్రజలకు పలు కీలక సూచనలు చేశారు. ఈ తీవ్రమైన ఎండల వల్ల ముఖ్యంగా చిన్న పిల్లలు, వృద్ధులు మరియు బహిరంగ ప్రదేశాల్లో శ్రమిస్తున్న కార్మికులు వెంటనే ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని ప్రధాని ఆందోళన వ్యక్తం చేశారు. వేడి వల్ల వచ్చే అలసట చాలా త్వరగా ప్రమాదకరంగా మారి వడదెబ్బకు దారితీస్తుందని, అందువల్ల ప్రతి ఒక్కరూ స్వీయ జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఎండల నుంచి తట్టుకోవడానికి ప్రతి ఒక్కరూ నిరంతరం నీరు తాగుతూ శరీరాన్ని డీహైడ్రేషన్‌కు గురికాకుండా చూసుకోవాలని ప్రధాన మంత్రి సూచించారు. అత్యవసర పనులపై బయటకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా తాగునీటిని వెంట తీసుకెళ్లాలని, అలాగే సాటి మానవత్వంతో తోటివారికి కూడా ఒక గ్లాస్ తాగునీరు ఆఫర్ చేయాలని పిలుపునిచ్చారు. ఎండ తీవ్రత వల్ల తల తిరగడం, వికారం, తీవ్రమైన అలసట వంటి వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే గమనించి అప్రమత్తం కావాలన్నారు. ఎవరైనా వడదెబ్బ బారిన పడినా, తలనొప్పితో బాధపడుతున్నా వెంటనే వారిని నీడ ఉన్న చల్లని ప్రదేశానికి తరలించి, తాగునీరు లేదా ఓఆర్ఎస్ (ORS) వంటి ద్రవపదార్థాలను తక్షణమే అందించాలని ప్రధాని వివరించారు. ఇంట్లో ఉండే వృద్ధ తల్లిదండ్రులు, తాత, అమ్మమ్మ, నాన్నమ్మల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని, వారిని నిరంతరం గమనిస్తూ ఉండాలని పీఎం మోదీ కోరారు. వారు కూడా క్రమం తప్పకుండా తాగునీరు తీసుకునేలా చూడాలని, ముఖ్యంగా మధ్యాహ్నం సమయంలో వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ బయటకు వెళ్లనీయకుండా నిలువరించాలని సూచించారు. ఈ వేసవి కాలంలో వృద్ధులకు అవసరమైనంత సమయం విశ్రాంతిని కల్పించడం ఎంతో ముఖ్యమని ప్రధాని నరేంద్ర మోదీ తన సందేశంలో స్పష్టం చేశారు.

# అప్పుల బాధకు కుటుంబం బలి!

**-ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య**
**-మృతుల్లో భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు**
**-మామిడి తోటలో భార్య, ఇద్దరు పిల్లలను సంపులో పడేసి తాను ఉరివేసుకొని ఆత్మహత్య**
**-సలికెలపురంలో ఘోరం**
**-డోకూర్ లో విషాదం**

**సిద్దిపేట టైమ్స్, దేవరకద్ర(వనపర్తి), మే 27 :**

ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అప్పుల బాధకు ఓ కుటుంబం బలైపోయింది. విధి ఆడిన నాటకంలో ఆ కుటుంబం పావైంది. ఆడుతూ పాడుతూ ఆనందంగా గడుపుతున్న ఆ కుటుంబాన్ని చూసి విధి ఓరువలేకపోయింది.అప్పుల బాధ తట్టుకోలేక ఓ వ్యక్తి భార్య, తన ఇద్దరు పిల్లలను సంపులో పడేసి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని వనపర్తి జిల్లా ఖిల్లా గణపురం మండల పరిధిలోని సలికేలపురంలో ఈ విషాదకర సంఘటన చోటుచేసుకుంది. మృతుల కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. దేవరకద్ర మండలం డోకూర్ గ్రామానికి చెందిన గంగుల నర్సిములు (40) తన భార్య పిల్లలతో కలసి సలికేలపురం శివారులో ఓ మామిడి తోటను లీజుకు తీసుకొని వ్యాపారం చేస్తున్నారు. అక్కడ తన భార్య ఎల్లమ్మ (36), కుమారుడు సాయి నిహాల్ (15), కూతురు సాహితీ శ్రీ (13)లతో కలిసి తోటలోనే ఉన్న ఓ ఇంటిలో గంగుల నరసిములు ఉంటున్నారు. ఈ క్రమంలో వ్యాపారం కోసం కొన్ని లక్షల రూపాయల అప్పును గంగుల నర్సిములు చేయాల్సి వచ్చింది. అయితే అప్పుల బాధ ఎక్కువ కావడంతో నర్సిములు మంగళవారం అర్ధరాత్రి భార్య, కొడుకు, కూతురులను అక్కడే ఉన్న నీటి సంపులో కాళ్లు చేతులు కట్టేసి పడేశాడు. ఆ తర్వాత ఈ విషయాన్ని తమ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఇంట్లో అందర్నీ చంపేశాను.. తాను కూడా ఉరి వేసుకుంటున్నాను.. అని చెప్పి నర్సిములు కూడా అక్కడే ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీంతో మృతుల బంధువులు, గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్ నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతుల శవాలను బుధవారం సాయంత్రం వారి స్వగ్రామానికి తీసుకెళ్లారు. గ్రామానికి చెందిన ఒక కుటుంబం అప్పుల బాధను భరించలేక బలవన్మరణానికి పాల్పడడంతో మృతుల స్వగ్రామమైన డోకూర్ లో విషాద ఛాయాలు అలుముకున్నాయి. జరిగిన సంఘటన గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుల శవాల పక్కన పడి మృతుల కుటుంబ సభ్యులు రోధించిన తీరు అందరిని కలిసివేసింది.

# అకాల వర్షాలతో తడిసిన ధాన్యం

**-కల్లాలు, కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల కన్నీరు**
**-రాష్ట్రవ్యాప్తంగా వరుసగా కురిసిన భారీ వానలు**
**- చెరువులను తలపించిన కొనుగోలు కేంద్రాలు**
**-టార్పాలిన్ల కొరత, రవాణా జాప్యమే శాపంగా మారిన వైనం**
**-రోడ్లపైకి చేరిన రైతుల నిరసనలు**
**-తడిచిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలిస్తున్న అధికారులు**
**-తక్షణ కొనుగోళ్లకు డిమాండ్**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 27 :**

తెలంగాణలోని అన్నదాతలపై ప్రకృతి పగబట్టింది. వరుసగా రెండు రోజుల పాటు కురిసిన అకాల వర్షాలు రైతాంగాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట, యాదాద్రిభువనగిరి, కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, మహబూబ్‌నగర్ సహా పలు జిల్లాల్లో మంగళవారం అర్ధరాత్రి, బుధవారం తెల్లవారుజామున కురిసిన వర్షాలకు ధాన్యం కల్లాలు, కొనుగోలు కేంద్రాలు చిన్నపాటి చెరువులను తలపించాయి. రాత్రికిరాత్రే రైతులు కేంద్రాలకు పరుగులు తీసి, ధాన్యం కుప్పలపై వరద నీరు రాకుండా కాపాడుకునేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేకపోవడం, కొన్నిచోట్ల కేంద్రాలు లోతట్టు ప్రాంతాలలో ఉండటంతో వేల క్వింటాళ్ల ధాన్యం నీట తడిసి ముద్దయింది. తడిసిన ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేస్తామని ప్రభుత్వం ముందే ప్రకటించినప్పటికీ, క్షేత్రస్థాయి నిర్వాహకుల నుంచి స్పష్టమైన భరోసా లభించకపోవడంతో పలుచోట్ల రైతులు తీవ్ర ఆందోళనకు దిగారు. మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో వడ్లు, మక్కల కొనుగోళ్లు ఆలస్యం కావడంతో వర్షం వల్ల రైతులు ఆగమాగమయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర మండలంలో అత్యధికంగా 139.6 మి.మీ. వర్షపాతం నమోదైంది. ఈ జిల్లాల్లో తడిసిన 600 టన్నులకు పైగా ధాన్యాన్ని అధికారులు బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించారు. వనపర్తి జిల్లా గుమ్మడంలో తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనాలంటూ రైతులు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేయగా, అధికారులు హామీ ఇచ్చి శాంతింపజేశారు. యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్, వలిగొండ పరిధిలో ఆరబోసిన ధాన్యం తడిసిపోగా, దామెరగిద్దలో పిడుగుపాటుకు ఓ కోడె ఎద్దు మృత్యువాత పడింది. మెదక్ జిల్లా తూప్రాన్‌లో లారీల కొరత కారణంగా 15 రోజులుగా ఎదురుచూస్తున్న రైతుల కళ్లముందే 1,000 క్వింటాళ్లకు పైగా ధాన్యం బస్తాలు తడిసిపోయాయి. నాగులపల్లిలో అధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతులు రోడ్డుపై బైఠాయించారు. ఇటు ఉమ్మడి కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లోని మార్కెట్ యార్డులు వరద నీటితో నిండిపోవడంతో రైతులు బకెట్లతో నీటిని తోడేయాల్సిన పరిస్థితి వచ్చింది. ఎప్పటికప్పుడు పంట సేకరించకపోవడం వల్లే తమకు ఈ ఊహించని నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. మెట్‌పల్లి, రామడుగు, కోరుట్ల, చొప్పదండి మార్కెట్ యార్డుల్లోనూ ధాన్యం రాశులు నీట మునిగాయి. కొనుగోళ్లలో జరుగుతున్న జాప్యాన్ని నిరసిస్తూ చందుర్తి మండలం మల్యాల గ్రామ అన్నదాతలు కోరుట్ల ప్రధాన రహదారిపై నిరసన ప్రదర్శన చేపట్టారు. సకాలంలో కాంటాలు వేసి, ధాన్యాన్ని మిల్లులకు తరలించి ఉంటే సమస్య తీవ్రత తగ్గేదని, ఇప్పటికైనా ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన స్పందించి తడిసిన పంటను త్వరగా సేకరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

# ఫామ్‌హౌస్‌లో సీన్ రీకన్‌స్ట్రక్షన్

**- భగీరథ్ ను ఫామ్‌హౌస్‌కు తీసుకువెళ్లి క్రైమ్ సీన్ పునర్నిర్మించిన పేట్‌బషీరాబాద్ పోలీసులు**
**-నిందితుడి స్నేహితుల విచారణ**
**-బాధితురాలు, తల్లి స్టేట్‌మెంట్ల ఆధారంగా దర్యాప్తు**
**-చర్లపల్లి జైలు నుంచి మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతించిన మల్కాజ్‌గిరి కోర్టు**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 27 :**

పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్‌ను పేట్‌బషీరాబాద్ పోలీసులు కస్టడీకి తీసుకున్నారు. దర్యాప్తులో భాగంగా ఈరోజు అతడిని మొయినాబాద్ మండలంలోని అరణ్య ఫామ్‌హౌస్‌కు తీసుకువెళ్లి క్రైమ్ సీన్ రీకన్‌స్ట్రక్షన్ (ఘటనా స్థల పునర్నిర్మాణం) చేశారు. ఈ కేసులో మరింత సమాచారాన్ని సేకరించేందుకు పోలీసులు ఇప్పటికే బండి భగీరథ్ నలుగురు స్నేహితులను క్షుణ్ణంగా ప్రశ్నించారు. ప్రస్తుతం బాధితురాలు, ఆమె తల్లి ఇచ్చిన అధికారిక స్టేట్‌మెంట్ ఆధారంగా పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. మొయినాబాద్‌లోని అరణ్య ఫామ్‌హౌస్‌లో తన కుమార్తెపై అఘాయిత్యం జరిగిందని బాధితురాలి తల్లి పోలీసులకు ఇచ్చిన రాతపూర్వక ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుడు తన కుమార్తెపై తీవ్ర ఒత్తిడి తెచ్చి బలవంతంగా మద్యం తాగించాడని, అనంతరం ఆమె పట్ల అత్యంత అనుచితంగా ప్రవర్తించాడని ఫిర్యాదులో వివరించారు. ఈ తీవ్రమైన ఆరోపణల నేపథ్యంలో సంఘటనా స్థలంలో అస్సలు ఏం జరిగిందనే విషయాలను సాంకేతికంగా నిర్ధారించుకోవడానికి పోలీసులు నిందితుడిని నేరుగా ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లి విచారించారు. ఈ నెల 16వ తేదీన అరెస్టైన బండి భగీరథ్ ప్రస్తుతం చర్లపల్లి కేంద్ర కారాగారంలో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు. ఈ క్రమంలో నిందితుడిని విచారించేందుకు మల్కాజ్‌గిరి కోర్టు మూడు రోజుల పోలీస్ కస్టడీకి అనుమతి ఇచ్చింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో పేట్‌బషీరాబాద్ పోలీసులు ఈరోజు ఉదయం చర్లపల్లి జైలుకు చేరుకుని భగీరథ్‌ను తమ ఆధీనంలోకి తీసుకున్నారు. కస్టడీ ముగిసిన అనంతరం నిందితుడిని తిరిగి న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టనున్నారు.

# అర్హులైన పేదలందరికీ దశలవారీగా పక్కా ఇళ్లు

**- మంత్రి శ్రీధర్‌బాబు**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 27 :**

రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ దశలవారీగా పక్కా ఇళ్లను అందిస్తామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. హైదరాబాద్ మూసాపేట పరిధిలోని కైత్లాపూర్ రెండు పడక గదుల ఇళ్ల సముదాయంలో అమృనగర్‌కు చెందిన 62 మంది లబ్ధిదారులకు ఆయన బుధవారం ఇళ్ల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. ప్రజా ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ప్రకటించారు. హైదరాబాద్‌ను అంతర్జాతీయ స్థాయిలో విశ్వనగరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం మెరుగైన మౌలిక వసతులను కల్పిస్తోందని మంత్రి శ్రీధర్‌బాబు వివరించారు. నగరంలో శరవేగంగా పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా తాగునీటిని నిరంతరం అందించేందుకు ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నట్లు పేర్కొన్నారు. కైత్లాపూర్ ఇళ్ల సముదాయంలో ఇంకా మిగిలి ఉన్న గృహాల కేటాయింపు ప్రక్రియలో స్థానికులతో పాటు వికలాంగులకు, జర్నలిస్టులకు పెద్దపీట వేస్తామని లబ్ధిదారులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. కూకట్‌పల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని సూచించారు. ఈ పట్టాల పంపిణీ మహోత్సవంలో స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ ఎం.మనుచౌదరి, ఎమ్మెల్సీ నవీన్‌రావు, కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బండి రమేశ్, మేడ్చల్ ఆర్‌డీఓ శ్యాంప్రసాద్, కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ మయాంక్ సింగ్, తహసీల్దార్ స్వామి తదితర ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# తుమ్మిడిహెట్టి ఎత్తుపై మహారాష్ట్రతో చర్చలు

**-సీఎం రేవంత్ రెడ్డి కీలక లేఖ**
**-తుమ్మిడిహెట్టి బ్యారేజీ ఎత్తు పెంపుపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్‌కు లేఖ**
**-తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృంద సమావేశానికి సమయం కోరిన ముఖ్యమంత్రి**
**-ఎఫ్ఆర్ఎల్ పెంచితే ఉత్తర తెలంగాణకు గ్రావిటీ ద్వారా నీరందే అవకాశం**

**సిద్దిపేట టైమ్స్, హైదరాబాద్, మే 27 :**

తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తు, నిర్మాణంపై మహారాష్ట్రతో చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వం ముందడుగు వేసింది. ఈ మేరకు మహారాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ దేవేంద్ర ఫడ్నవీస్‌కు తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ ఎ. రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ఈ అంశంపై చర్చించేందుకు తెలంగాణ ప్రభుత్వ ప్రతినిధి బృందంతో సమావేశం ఏర్పాటు చేయాలని, అందుకు అనుకూలమైన తేదీని త్వరగా ఖరారు చేయాలని ముఖ్యమంత్రి ఆ లేఖలో కోరారు. గతంలో డా. బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహిత - చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టులో భాగంగా తుమ్మిడిహెట్టి వద్ద బ్యారేజ్‌ను మొదట 152 మీటర్ల ఎత్తుతో నిర్మించాలనుకున్నారు. అయితే, 2016 ఆగస్టు 23న జరిగిన ఇంటర్ స్టేట్ బోర్డు సమావేశంలో 148 మీటర్ల ఎత్తులో బ్యారేజ్ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వం సమ్మతి తెలపడంతో పాటు అవసరమైన అనుమతులకు సహకారం అందిస్తామని అప్పట్లో ప్రకటించింది. ఇటీవల ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పూర్తి చేయాలని గట్టిగా నిర్ణయించిన తెలంగాణ ప్రభుత్వం ఈ నీటిపారుదల అంశాన్ని పున:సమీక్షించింది. గతంలో అంగీకరించిన 148 మీటర్ల పూర్తి స్థాయి నీటి మట్టం (FRL) ఉత్తర తెలంగాణ ప్రాంతాల నీటి అవసరాలకు ఎంతమాత్రం సరిపోదని సాగునీటి నిపుణుల సూచనలతో ప్రభుత్వం ఒక స్పష్టమైన అంచనాకు వచ్చింది. ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ జిల్లాల్లోని సాగునీరు, తాగునీటి అవసరాలను పూర్తి స్థాయిలో తీర్చాలంటే తుమ్మిడిహెట్టి బ్యారేజ్ ఎత్తుపై మరోసారి పొరుగు రాష్ట్రంతో విస్తృతంగా చర్చించాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన లేఖలో ప్రత్యేకంగా ప్రస్తావించారు. బ్యారేజీ ఎత్తును 148 మీటర్ల కంటే కొంత ఎక్కువగా పెంచి ఎఫ్ఆర్ఎల్‌ను ఖరారు చేసినా, మహారాష్ట్ర భూభాగంలో ముంపు ప్రభావం చాలా తక్కువగానే ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి లేఖలో వివరించారు. ఎఫ్ఆర్ఎల్‌ను పెంచడం ద్వారా విద్యుత్ ఖర్చు లేకుండా సహజ సిద్ధమైన గ్రావిటీ (గురుత్వాకర్షణ) ద్వారా తెలంగాణకు భారీగా నీటిని తరలించుకునే వీలుంటుందని ఆయన పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల ప్రయోజనాలతో పాటు తెలంగాణ పరివాహక ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ సమావేశాన్ని సాధ్యమైనంత త్వరగా ఏర్పాటు చేయాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.





# పచ్చిరొట్ట ఎరువులతోనే భూసారానికి భరోసా

*** రసాయన ఎరువుల ఖర్చుకు చెక్ రైతులకు రెట్టింపు లాభాలు**
*** దొమ్మాట వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్ కుమార్**

**దౌల్తాబాద్, మే 27(సిద్దిపేట టైమ్స్):**

ప్రస్తుతం సాగుభూముల్లో విచ్చలవిడిగా రసాయన ఎరువుల వినియోగం పెరగడంతో భూముల సార శక్తి క్రమంగా తగ్గిపోతుందని వ్యవసాయ శాఖ అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులతో రైతులకు వ్యవసాయం భారంగా మారుతున్న తరుణంలో పచ్చిరొట్ట ఎరువుల వినియోగం భూసారాన్ని కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తుందని దొమ్మాట వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష్ కుమార్ తెలిపారు. మే, జూన్ నెలల్లో కురిసే తొలకరి వర్షాలను సద్వినియోగం చేసుకొని రైతులు పచ్చిరొట్ట పంటలు సాగు చేస్తే భూమిలో సేంద్రియ పదార్థం పెరిగి, రసాయన ఎరువుల అవసరం తగ్గడమే కాకుండా తదుపరి పంటల్లో దిగుబడులు కూడా గణనీయంగా పెరుగుతాయని ఆయన పేర్కొన్నారు.

**ఏ పంటకు ఏ పచ్చిరొట్ట?**

**చౌడు భూములకు జీలుగ ఉత్తమం**

చౌడు భూములు, నీరు నిలిచే నల్లరేగడి నేలలకు జీలుగ పంట అత్యంత అనుకూలమని అధికారులు సూచిస్తున్నారు. నేలలోని హానికర లవణాలను తగ్గించి భూమిని తిరిగి సాగుకు అనువుగా మార్చే గుణం జీలుగకు ఉందన్నారు. ఈ పంట ద్వారా ఎకరానికి 35 నుంచి 40 కిలోల వరకు నత్రజని భూమికి అందుతుందని తెలిపారు. దీని వేర్లు లోతుగా వెళ్లి గట్టిపడిన నేలను మెత్తగా మారుస్తాయని చెప్పారు.

**వేగంగా పెరిగే జనుము**

ఎర్ర నేలలు, తేలికపాటి ఇసుక నేలలకు జనుము పంట మంచి ఫలితాలు ఇస్తుందని పేర్కొన్నారు. విత్తిన ఐదు రోజుల్లోనే మొలకెత్తే ఈ పంట వేగంగా పెరిగి పొలాల్లో కలుపు మొక్కలను అరికడుతుందని తెలిపారు. ఆకుల్లో ప్రోటీన్లు అధికంగా ఉండటంతో అవసరమైతే పశువుల మేతగా కూడా వినియోగించుకోవచ్చన్నారు.

**పెసర – మినుముతో డబుల్ లాభం**

ఎరువుతో పాటు అదనపు ఆదాయం ఆశించే రైతులకు పెసర, మినుము పంటలు మంచి ప్రత్యామ్నాయమని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. ఈ పంటలు భూమిపై పచ్చటి పరుపులా విస్తరించి నేలలో తేమ నిల్వ ఉండేలా చేస్తాయని తెలిపారు. విత్తిన 60 రోజులకే కాయలు రావడంతో వాటిని విక్రయించి ఎకరానికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు అదనపు ఆదాయం పొందవచ్చన్నారు. అనంతరం మిగిలిన పచ్చిరొట్టను భూమిలో కలియదున్నితే త్వరగా కుళ్లిపోయి భూసారాన్ని పెంచుతుందని వివరించారు.

**యాజమాన్య పద్ధతులు ఇలా...**

మే లేదా జూన్ నెలల్లో తొలకరి వర్షాలు పడగానే విత్తుకోవాలి.
ప్రధాన పంట సాగుకు 50-60 రోజుల ముందే పచ్చిరొట్ట పంటలు వేయాలి.
ఎకరానికి జీలుగ, జనుము విత్తనాలు 12-15 కిలోలు అవసరం.
పెసర, మినుము విత్తనాలు 6-8 కిలోలు సరిపోతాయి.
జీలుగ, జనుము పంటలను విత్తిన 45 రోజుల తర్వాత పూత దశలోనే రోటవేటర్‌తో భూమిలో కలియదున్నాలి.
పెసర, మినుము పంటల్లో కాయలు కోసుకున్న తర్వాత నీరు పెట్టి దున్నాలి.
కలియదున్నిన తర్వాత 10-15 రోజుల అనంతరం ప్రధాన పంట సాగు చేయాలి.





**రైతులకు కలిగే ప్రయోజనాలు**

పచ్చిరొట్ట పంటలు గాల్లోని నత్రజనిని భూమిలో స్థిరపరచడం వల్ల ప్రధాన పంటలో 25 నుంచి 30 శాతం వరకు యూరియా, డీఏపీ వినియోగాన్ని తగ్గించుకోవచ్చని అధికారులు తెలిపారు. నేలలో సేంద్రియ కర్బన శాతం పెరిగి మిత్ర పురుగుల సంఖ్య అధికమవడంతో తదుపరి పంట దిగుబడులు 10-15 శాతం వరకు పెరుగుతాయని పేర్కొన్నారు. కేవలం రూ.1500 లోపు విత్తన పెట్టుబడితోనే భూమి ఆరోగ్యం మెరుగుపడి రైతులకు వేల రూపాయల ఎరువుల ఖర్చు ఆదా అవుతుందని వెల్లడించారు.

**నిపుణుల సూచనలు**

చౌడు లేదా నల్లరేగడి నేలలు ఉన్న రైతులు జీలుగ, ఎర్ర నేల రైతులు జనుము సాగు చేయాలని, అదనపు ఆదాయం ఆశించే రైతులు పెసర లేదా మినుము పంటలను ఎంచుకుని భూసారాన్ని కాపాడుకోవాలని వ్యవసాయ నిపుణులు సూచిస్తున్నారు.

# అకాల వర్షం తడిసిన ధాన్యం ఆందోళనలో రైతన్న

**- తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులకు రైతన్నల వినతి**

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట మే 27**

నిజాంపేట మండల వ్యాప్తంగా గత రాత్రి కురిసిన వర్షానికి రైతులు ఎండబోసిన వరి ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కాంటాలు సకాలంలో జరగకపోవడంతో 15 రోజుల్లో పూర్తయ్యే ప్రక్రియ నెలరోజులు గడిచినా పూర్తి కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి వడ్లను రైస్‌మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అలాగే కల్వకుంట గ్రామంలో రైతులు కొనుగోలు కేంద్రాలలో వడ్లను తరలించి నెల రోజులు గడుస్తున్నా కాంటలు కావడం లేదని కాంటలు చేయకుండా నిర్వాహకులు నిర్లక్ష్యం చేస్తున్నారని రైతులు మండిపడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి కాంటాలను త్వరగతిన పూర్తి చేయాలని రైతులు వేడుకుంటున్నారు.



# దేశ నిర్మాణంలో నెహ్రూ సేవలు మరువలేనివి

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**

దేశ నిర్మాణంలో మాజీ ప్రధాని నెహ్రూ సేవలు మరువలేనివని కొమరవెల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మహాదేవుని శ్రీనివాస్ అన్నారు. నెహ్రూ వర్ధంతి సందర్భంగా బుధవారం మండల కేంద్రంలో నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. భారతరత్న నెహ్రు ఆధునిక భారత నిర్మాణ శిల్పిగా దేశ చరిత్రలో నిలిచిపోయారని అన్నారు. దేశాన్ని అభివృద్ధి దిశగా నడిపించి పారిశ్రామిక విద్య శాస్త్ర సాంకేతిక రంగాలకు బలమైన పునాదులు వేసిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. ప్రజాస్వామ్య పరిరక్షణ దేశ ఐక్యతకు ఆయన కృషి చేశారని అన్నారు. దేశ అభివృద్ధి సెక్యులర్ భావజాలం సామాజిక సమానత్వం కోసం నెహ్రూ చేసిన కృషి నేటి తరానికి ఆదర్శమని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగంపల్లి కనకరాజు, మల్లం బాలయ్య, చింతల పరుశరాములు, ఏర్పుల రాజు, ఉప్పల వంశీకృష్ణ, ఎనిశెట్టి కిరణ్, మాట్ల మురళి, గోదల నవీన్, లింగంపల్లి మహేష్, బొచ్చు కిషన్, ఎలా సత్యనారాయణ, మాట్ల శ్రీనివాస్, సార్ల కొల్బాయ్ కనకయ్య, దుర్గయ్య, తాళ్లపల్లి కనకయ్య, సిలువేరు మల్లేశం, చింతల రమేష్ తదితరులు పాల్గొన్నారు.



# అప్పుల బాధకు కుటుంబం బలి!

**-ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఆత్మహత్య**
**-మృతుల్లో భార్యాభర్తలు, ఇద్దరు పిల్లలు**
**-మామిడి తోటలో భార్య, ఇద్దరు పిల్లలను సంపులో పడేసి తాను ఉరివేసుకొని ఆత్మహత్య**
**-సలికెలపురంలో ఘోరం**
**-డోకూర్ లో విషాదం**

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**



ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. అప్పుల బాధకు ఓ కుటుంబం బలైపోయింది. విధి ఆడిన నాటకంలో ఆ కుటుంబం పావైంది. ఆడుతూ పాడుతూ ఆనందంగా గడుపుతున్న ఆ కుటుంబాన్ని చూసి విధి ఓరువలేకపోయింది.అప్పుల బాధ తట్టుకోలేక ఓ వ్యక్తి భార్య, తన ఇద్దరు పిల్లలను సంపులో పడేసి తాను ఆత్మహత్య చేసుకున్నాడు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలోని వనపర్తి జిల్లా ఖిల్లా గణపురం మండల పరిధిలోని సలికేలపురంలో ఈ విషాదకర సంఘటన చోటుచేసుకుంది. మృతుల కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి. దేవరకద్ర మండలం డోకూర్ గ్రామానికి చెందిన గంగుల నర్సిములు (40) తన భార్య పిల్లలతో కలసి సలికేలపురం శివారులో ఓ మామిడి తోటను లీజుకు తీసుకొని వ్యాపారం చేస్తున్నారు. అక్కడ తన భార్య ఎల్లమ్మ (36), కుమారుడు సాయి నిహాల్ (15), కూతురు సాహితీ శ్రీ (13) లతో కలిసి తోటలోనే ఉన్న ఓ ఇంటిలో గంగుల నరసిములు ఉంటున్నారు. ఈ క్రమంలో వ్యాపారం కోసం కొన్ని లక్షల రూపాయల అప్పును గంగుల నర్సిములు చేయాల్సి వచ్చింది. అయితే అప్పుల బాధ ఎక్కువ కావడంతో నర్సిములు మంగళవారం అర్ధరాత్రి భార్య, కొడుకు, కూతురులను అక్కడే ఉన్న నీటి సంపులో కాళ్లు చేతులు కట్టేసి పడేశాడు. ఆ తర్వాత ఈ విషయాన్ని తమ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి ఇంట్లో అందర్నీ చంపేశాను.. తాను కూడా ఉరి వేసుకుంటున్నాను.. అని చెప్పి నర్సిములు కూడా అక్కడే ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. దీంతో మృతుల బంధువులు, గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని శవ పంచనామా నిర్వహించి కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్ నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతుల శవాలను బుధవారం సాయంత్రం వారి స్వగ్రామానికి తీసుకెళ్లారు.



గ్రామానికి చెందిన ఒక కుటుంబం అప్పుల బాధను భరించలేక బలవన్మరణానికి పాల్పడడంతో మృతుల స్వగ్రామమైన డోకూర్ లో విషాద ఛాయాలు అలుముకున్నాయి. జరిగిన సంఘటన గ్రామస్తులు జీర్ణించుకోలేకపోతున్నారు. మృతుల కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. మృతుల శవాల పక్కన పడి మృతుల కుటుంబ సభ్యులు రోధించిన తీరు అందరిని కలిసివేసింది.





# యాదగిరిగుట్టలో ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతుల పూజలు

**- వివాహ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు**

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) తమ కుటుంబ సమేతంగా బుధవారం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయానికి వెళ్లి అక్కడ ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివాహ వార్షికోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే జిఎంఆర్ తమ కుటుంబంతో కలిసి యాదగిరిగుట్టకు వెళ్లి స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదితర పూజలు నిర్వహించారు. అక్కడ పురోహితులు ఎమ్మెల్యే జిఎంఆర్ దంపతులపై అక్షింతలు చల్లి ఆశీర్వచనం పలికారు. స్వామి వారి ప్రసాదాన్ని అందజేశారు.




# మున్సిపల్ సమావేశంలో పలు తీర్మానాలు

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**

చేర్యాల మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం బుధవారం జరగగా పలు తీర్మానాలను చేశారు. ఈ సమావేశంలో పట్టణములో మోరీలు తీయడం, సిసి రోడ్లను నిర్మించుట జెసిబి రిపేర్, బకెట్ పెట్టించడం తదితరాలకు సంబంధించి తీర్మానాలను ఆమోదించారు. వర్షాకాలానికి అనుగుణంగా బ్లీచింగ్ పౌడర్, సున్నము, దోమల నిర్మూలన మందులు కొనుగోలు చేయాలని పట్టణములో పారిశుద్ధ్య నిర్వహణ సరిగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని తీర్మానించారు. అదేవిధంగా నూతన జంతువధశాలను ఏర్పాటు చేయాలని తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముస్త్యాల అరుణ, వైస్ చైర్మన్ మేడిశెట్టి ఉమా కౌన్సిలర్లు కమలాపురం గీతాంజలి, నిమ్మ సుప్రజా, బబ్లు, దుర్గయ్య, సురేష్ కమిషనర్ నాగేందర్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, మేనేజర్ ప్రభాకర్ సిబ్బంది పాల్గొన్నారు.




# కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నెహ్రూ వర్ధంతి

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి:**

భారత తొలి ప్రధాని స్వర్గీయ జవహర్ లాల్ నెహ్రూ వర్ధంతి బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేర్యాల పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాత బస్టాండ్ వద్ద నెహ్రూ విగ్రహానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరి శ్రీకాంత్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఆడెపు చంద్రయ్య, పుర్మా ఆగం రెడ్డి, మంజె మల్లేశం, ఆడెపు నరేందర్, కాటం శ్రీనివాస్, జవహరుద్దీన్, తడక లింగమూర్తి, కల్కి రమేష్, అంబాల రాము, బుట్టి బిక్షపతి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



# యువకుడిపై దాడి

**– చికిత్స పొందుతూ మృతి,**
**- 20 మందిపై కేసు నమోదు**

**దౌల్తాబాద్, మే 27 (సిద్దిపేట టైమ్స్):**

రాయపోల్ మండలం రాంసాగర్ గ్రామంలో జరిగిన ఘోర ఘటనలో యువకుడు శ్యామ్ చారి (31) దాడికి గురై చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసుల కథనం ప్రకారం, కొద్ది రోజుల క్రితం మిరుదొడ్డి మండలానికి చెందిన ఓ వ్యక్తికి రాంసాగర్ గ్రామానికి చెందిన యువతితో వివాహం జరిగింది. అయితే మృతుడు శ్యామ్ చారికి ఆ వివాహితతో గతంలో పరిచయం ఉండటంతో వివాదం మొదలైంది. ఈ క్రమంలో ఆమెను రెండు రోజుల పాటు ఇంటి నుంచి తీసుకెళ్లి తిరిగి పంపించిన ఘటనపై ఇరు కుటుంబాల మధ్య ఉద్రిక్తత పెరిగింది.ఈ విషయంపై ఆగ్రహించిన యువతి కుటుంబ సభ్యులు శ్యామ్ చారిపై దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన అతన్ని ముందుగా గజ్వేల్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికు తరలించగా, అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆసుపత్రి, హైదరాబాద్కు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు రాయపోల్ ఎస్సై కే. మానస తెలిపారు.మృతుడికి భార్య జ్యోతి, ఒక కుమారుడు మరియు ఒక కుమార్తె ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి సుమారు 20 మంది నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు. గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో బుధవారం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



## దాడికి పాల్పడ్డ వ్యక్తికి రిమాండ్..

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట మే 27 ***

నిజాంపేటమండల కేంద్రంలో గత వారం రోజుల క్రితం గ్రామానికి పంజా కరుణాకర్,ను అదే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు అతనిపై దాడి చేయగా తలకు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వ్యక్తి స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా ఇట్టి విషయంపై ఎస్ఐ రాజేష్ విచారణ చేపట్టి దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి బుధవారం రిమాండ్ కు తరలించారు.ఎవరైనా చట్ట వ్యతిరేకత కార్యకలాపాలకు పాటుపడితే ఎంతటి వారైనా సరే చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రాజేష్ హెచ్చరించారు.






## ట్రాక్టర్ ద్వారా ధాన్యం తరలించాలని ఎస్సై విజ్ఞప్తి

**దౌల్తాబాద్, మే 27 (సిద్దిపేట టైమ్స్):**

యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యం కొనుగోలు ప్రక్రియలో జాప్యం ఏర్పడిన నేపథ్యంలో, రైతులు తమ ధాన్యాన్ని ట్రాక్టర్ల సహాయంతో కొనుగోలు కేంద్రాల నుంచి ఐకేపీ కేటాయించిన రైస్ మిల్లులకు తరలించాలని స్థానిక ఎస్సై జి. అరుణ్ కుమార్ విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని వివిధ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నిల్వలు అధికంగా పేరుకుపోవడంతో వాటిని త్వరితగతిన తరలించేందుకు పోలీస్ శాఖ చర్యలు తీసుకుంటోందని ఆయన తెలిపారు. లారీలు, డీసీఎంలను సమీకరించే ప్రయత్నాలు కూడా జరుగుతున్నాయని వివరించారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో రైతులు ముందస్తుగా జాగ్రత్తలు తీసుకుని, తమ ధాన్యాన్ని ట్రాక్టర్ల ద్వారా సమీప రైస్ మిల్లులకు తరలించి సహకరించాలని ఎస్సై కోరారు.ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ విక్రం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






## చివరి గింజ వరకూ కొనుగోలు చేయాలి

**-జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి మే 27**

ధాన్యాన్ని చివరి గింజ వరకూ కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు.బుధవారం మెదక్ మండలంలోని రాయలపూర్, కౌడిపల్లి మండలం కుల్చారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు.ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ.. కల్లాల్లో ఉన్న ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అధికారులకు సూచించారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసే బాయిల్డ్ మిల్లులకు తరలిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు.సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## లారీలు లేక.. కొనుగోలు జరగక ..

***మార్కెట్ లోనే రోజుల తరబడి రైతులు**

**సిద్దిపేట టైమ్స్,కోహెడ:**

పంట పండించినా అమ్ముకోలేని దుస్థితి. లారీలు రాకపోవడంతో కొనుగోలు స్తంభించింది. వానొస్తే పంట తడిసిపోతుందన్న భయంతో రైతులు మార్కెట్ యార్డుల్లోనే బిక్కుబిక్కుమంటున్నారు. సిద్దిపేట జిల్లా కోహెడ మండలంలో రైతుల పరిస్థితి ఇది.మండలంలో మొక్క జొన్న రైతులు పండించిన మొక్కలను మార్కెట్ కమిటీలో ఆరబెట్టారు. అనంతరం సంచుల్లో నింపి కాంటాలు వేసి, ఆ సంచులను గమ్యస్థానానికి చేర్చేందుకు సరిపడ లారీలు అందుబాటులో లేకపోవడంతో కొనుగోలు ప్రక్రియ మధ్యలోనే ఆగిపోయింది. జిల్లా కలెక్టర్ హైమావతి సరిపడా లారీలు పంపిస్తామని చెప్పి నేటికి రెండు రోజులు గడుస్తున్నా పరిస్థితి మారలేదు. అధికారులు లారీలు పంపుతారన్న ఆశతో ఎదురుచూస్తున్నా ఫలితం లేదు. ఈ సమయంలో వర్షం పడితే మొత్తం పంట నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిస్తే మక్కలు పనికిరాకుండా పోతాయని వాపోతున్నారు.



*** సరిపడా లారీలు పంపించాలి**

**బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్**

లారీల కొరతను వెంటనే తీర్చి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని, లేకుంటే ఆందోళనకు దిగుతామని బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్ డిమాండ్ చేశాడు. అధికారులు స్పందించి రైతులను ఆదుకోవాలని కోరారు.

# మిల్లర్ల వేధింపులు అధికారుల అలసత్వం

- **కన్నీరు మున్నీరుగా రైతన్నలు**
- **ఒకవైపు చేతికందిన పంట.. మరోవైపు ఉరుములు, మెరుపులతో వర్షం**
- **వర్షపు నీటిలో తడిసి ధాన్యం.. దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు**
- **కొనుగోలు కేంద్రాల్లో జాప్యం – రైతుల ఆగ్రహం**
- **నాణ్యత సాకులతో ఆలస్యం చేస్తున్నారన్న ఆరోపణలు**

**దౌల్తాబాద్ మే 27(సిద్దిపేట టైమ్స్):**

నెలల తరబడి శ్రమించి పండించిన పంటను విక్రయించే చివరి దశలో రైతన్నలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దౌల్తాబాద్ మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న జాప్యం, మిల్లర్ల వ్యవహార శైలి, అధికారుల నిర్లక్ష్యంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేతికందిన పంటను అమ్ముకునే సమయానికి అకాల వర్షాలు తోడవడంతో అన్నదాతల పరిస్థితి మరింత దయనీయంగా మారింది. రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించి రోజుల తరబడి ఎదురుచూస్తున్నా తూకం, రవాణా, మిల్లింగ్ ప్రక్రియల్లో ఆశించిన వేగం కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. ఫలితంగా బహిరంగ ప్రదేశాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షాలకు తడిసి నాణ్యత కోల్పోతుందనే భయం రైతుల్లో పెరుగుతోంది. ఇటీవల కురుస్తున్న ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాల కారణంగా కేంద్రాల్లో ఉన్న ధాన్యం పూర్తిగా తడుస్తోందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే సాగు ఖర్చులు పెరిగి అప్పుల్లో ఉన్న రైతులకు ఈ పరిస్థితి మరింత భారంగా మారిందని చెబుతున్నారు. ఒకవైపు ప్రకృతి దెబ్బ, మరోవైపు అధికారుల నిర్లక్ష్యం రైతులను తీవ్ర నిరాశలోకి నెడుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల ఆరోపణల ప్రకారం, కొన్ని కొనుగోలు కేంద్రాల్లో మిల్లర్లు నాణ్యత ప్రమాణాలు, తేమ శాతం పేరుతో ధాన్యం స్వీకరణ ఆలస్యం చేస్తున్నారని తెలుస్తోంది. అవసరమైన స్థాయిలో మిల్లింగ్ ప్రక్రియ జరగకపోవడంతో కేంద్రాల్లో నిల్వలు పెరిగి కొత్తగా వచ్చే ధాన్యానికి చోటు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఇక కొనుగోలు కేంద్రాల వద్ద తగిన రక్షణ చర్యలు లేకపోవడం కూడా సమస్యను



మరింత తీవ్రం చేస్తోంది. ధాన్యం తడవకుండా టార్పాలిన్లు ఏర్పాటు చేయడం, గోదాములకు తరలించడం, వేగంగా లారీలను అందుబాటులోకి తేవడం వంటి చర్యలు తీసుకోవాల్సి ఉన్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. రైతులు మాట్లాడుతూ పంట పండించేది రైతే కానీ అమ్ముకునే దశలోనే ఇంత ఇబ్బంది వస్తే రైతు బతుకు ఎలా సాగుతుంది? ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో జాప్యాన్ని తగ్గించి వెంటనే ధాన్యం తరలించే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు వర్షాల నుంచి ధాన్యాన్ని కాపాడేందుకు అత్యవసర చర్యలు తీసుకోకపోతే రైతులకు భారీ ఆర్థిక నష్టం తప్పదనే ఆందోళన వ్యక్తమవుతోంది.

# దళిత రైతు భూమి అన్యాక్రాంతంపై రెడ్డి కుటుంబంపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలి డీబీఎఫ్ డిమాండ్

**దౌల్తాబాద్ మే 27 (సిద్దిపేట టైమ్స్):**

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం పరిధిలోని పడమటి కేశవాపూర్ గ్రామం కు చెందిన దళిత రైతు తాడేం నరేందర్ భూమిని అన్యాక్రాంతం చేస్తున్న వారిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ (డీబీఎఫ్) జాతీయ కార్యదర్శి పెద్ద లింగన్న గారి శంకర్ డిమాండ్ చేశారు. బుధవారం బచ్చన్నపేటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పడమటి కేశవాపూర్ గ్రామంలోని సర్వే నెంబర్ 584/డి లో ఉన్న రెండు ఎకరాల భూమిని గ్రామానికి చెందిన గూడ రమాబాయి నుండి 2011 సంవత్సరంలో దళితులు కొనుగోలు చేసి చట్టబద్ధంగా రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని తెలిపారు. అనంతరం ప్రభుత్వం నుండి పట్టాదారు పాసుపుస్తకాలు పొందడమే కాకుండా రైతు భరోసా పెట్టుబడి సాయం కూడా అందుకుంటున్నారని వివరించారు. అయితే అదే భూమి తమదేనని పేర్కొంటూ తాండ్ర శ్రీనివాస్ రెడ్డి, ఆయన కుమారుడు అఖిలేశ్వర్ రెడ్డి నకిలీ ధృవపత్రాలు సృష్టిస్తూ దళిత రైతులను వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. సాదా బాయినం ఆధారంగా భూమి కొనుగోలు చేశామని చెబుతూ దళితులను బెదిరింపులకు పాల్పడుతున్నారని పేర్కొన్నారు. దళితులు సాగు పనులు చేపట్టే ప్రతి సందర్భంలో అడ్డంకులు సృష్టిస్తూ, కడీలు విరగొట్టడం, వీడియోలు చిత్రీకరించి భయభ్రాంతులకు గురిచేయడం జరుగుతోందని ఆరోపించారు. ఈ విషయంపై గత జనవరి నెలలోనే బచ్చన్నపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ ఇప్పటివరకు కేసు నమోదు చేయకుండా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. దళిత రైతుల భూములను అన్యాక్రాంతం చేయడానికి ప్రయత్నిస్తున్న తాండ్ర శ్రీనివాస్ రెడ్డి, అఖిలేశ్వర్



రెడ్డిలపై వెంటనే ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో డీబీఎఫ్ నాయకులు సతీష్, పడమటి కేశవాపూర్ ఉపసర్పంచ్ తాడేం నరేందర్, మన్నె గణేష్, చరణ్ తదితరులు పాల్గొన్నారు.





# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని రైతుల రాస్తారోకో

**దౌల్తాబాద్ మే 27 (సిద్దిపేట టైమ్స్):**

రాయపోల్ మండలం పరిధిలోని కొత్తపల్లి బస్టాండ్ వద్ద ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని డిమాండ్ చేస్తూ రైతులు బుధవారం పెద్ద ఎత్తున రాస్తారోకో నిర్వహించారు. గజ్వేల్ - రామాయంపేట ప్రధాన రహదారిపై రైతులు ఆందోళనకు దిగడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టకపోవడం, మండలానికి ఒకే రైస్ మిల్లును కేటాయించడం, లారీల కొరత కారణంగా ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం పేరుకుపోయిందని ఆరోపించారు. మంగళవారం రాత్రి కురిసిన అకాల వర్షానికి కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దవడంతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిందని వాపోయారు.మండలంలోని ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో రైతులు రోజుల తరబడి ధాన్యం కొనుగోలు కోసం ఎదురుచూస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సరిపడా లారీలు, మిల్లులు ఏర్పాటు చేయకపోవడంతో వడ్ల తరలింపు పూర్తిగా నిలిచిపోయిందని పేర్కొన్నారు. ఇప్పటికే కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని కేంద్రాలకు తీసుకొచ్చిన



రైతులు కొనుగోలు కోసం పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.అకాల వర్షం, వడగండ్ల వాన కారణంగా కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తడవడంతో రైతులకు మరింత నష్టం వాటిల్లిందని తెలిపారు. “జై జవాన్ - జై కిసాన్” అంటూ రైతుల సంక్షేమం గురించి మాట్లాడే ప్రభుత్వం, రైతుల సమస్యలను మాత్రం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంటనే లారీలను సమకూర్చి తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి తరలింపును వేగవంతం చేయాలని రైతులు డిమాండ్ చేశారు. అధికారులు వచ్చి సమస్య పరిష్కారంపై హామీ ఇచ్చే వరకు ధర్నా విరమించేది లేదని స్పష్టం చేశారు.సమాచారం అందుకున్న షేక్ లతీఫ్, తహసీల్దార్ కృష్ణమోహన్, ఎస్సై మానస సంఘటన స్థలానికి చేరుకొని రైతులతో మాట్లాడారు. లారీలను సమకూర్చి త్వరితగతిన ధాన్యం తరలింపుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో రైతులు ధర్నాను విరమించారు.వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో సమస్యను వెంటనే పరిష్కరించి సకాలంలో ధాన్యం తరలించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని రైతులు హెచ్చరించారు.

# అకాల వర్షంతో తడిసిన ధాన్యం.. కొనుగోలు కేంద్రాల్లో రైతుల ఆవేదన

- **లారీల కొరత, మిల్లుల సమస్యతో ఇప్పటికే ఇబ్బందులు.. ఇప్పుడు వర్షంతో మరింత నష్టం**

**దౌల్తాబాద్, మే 27 (సిద్దిపేట టైమ్స్):**

అకాల వర్షం అన్నదాతల ఆశలపై నీళ్లు చల్లింది. ఉమ్మడి దౌల్తాబాద్ మండలంలో మంగళవారం రాత్రి కురిసిన భారీ గాలివానతో కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన ధాన్యం పూర్తిగా తడిసిపోవడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు. ఆరు కాలాల పాటు శ్రమించి పండించిన పంటను విక్రయించే సమయంలో ప్రకృతి మరోసారి రైతును పరీక్షించడంతో అన్నదాతలు కన్నీరు మున్నీరవుతున్నారు. ఇప్పటికే ధాన్యం కొనుగోళ్లలో తీవ్ర జాప్యం, మిల్లుల కొరత, లారీల సమస్యతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులకు అకాల వర్షం మరింత నష్టాన్ని మిగిల్చింది. కొనుగోలు కేంద్రాల వద్ద రోజుల తరబడి ధాన్యాన్ని ఆరబోసి కొనుగోలు కోసం ఎదురుచూస్తున్న సమయంలో ఒక్కసారిగా కురిసిన వర్షం ధాన్యాన్ని తడిపేసింది. దీంతో వడ్లు తడిసి ముద్దవడంతో రైతులు తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు.తూకం వేసిన బస్తాలు సైతం వర్షపు నీటిలో తడవడంతో ధాన్యం నాణ్యత దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు. సరైన సమయంలో మిల్లులు కేటాయించకపోవడం, లారీలు అందుబాటులో లేకపోవడం, గోనె సంచుల కొరత వంటి కారణాలతో ధాన్యం తరలింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం, అధికారులు తక్షణ చర్యలు తీసుకుని కొనుగోలు కేంద్రాల్లో పేరుకుపోయిన ధాన్యాన్ని వెంటనే తరలించేలా చర్యలు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. రాత్రంతా కొనుగోలు కేంద్రాల వద్దే ఉండి ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు నిద్రాహారాలు మానుకుని కాపలా కాస్తుండటం వారి దయనీయ పరిస్థితికి అద్దం పడుతోంది. కొనుగోలు వేగవంతం చేయాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.







# జిల్లా లో ఘనం గా మహిళా భద్రత, రక్షణ వారోత్సవాలు

**- లైంగిక వేధింపుల నిరోధక చట్టం 2013 మీద మహిళా ఉద్యోగులకు అవగాహన**
**- స్వయం గా చట్టం లో ఉన్న అంశాలను వివరించిన జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**
**- ప్రతీ కార్యాలయం లో ఇంటర్నల్ కంప్లైంట్ కమిటీ ల నియామకం తప్పనిసరి**
**- మహిళలకు సురక్షితమైన వాతావారణం ఉండడమే ప్రధాన లక్ష్యం**
**- జిల్లా అదనపు కలెక్టర్ నగేష్**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి మే 27**

ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 కార్యక్రమాల నేపథ్యంలో...నిర్వహిస్తున్న మహిళా భద్రత, రక్షణ వారోత్సవాలలో భాగంగా...బుధవారం లైంగిక, వేధింపుల నిరోధక చట్టం 2013 మీద కలెక్టరెట్ లోని కాన్ఫరెన్స్ హల్ లో... మహిళా ఉద్యోగులకు ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమాన్ని *జిల్లా అదనపు కలెక్టర్ నగేష్, ఇన్చార్జి DWO స్వరూప జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.. ముందుగా.. ఈ చట్టం లో ఉన్న ప్రతీ అంశాన్ని,ఇంటర్నల్ కమిటీ అవశ్యకత ను స్వయం గా కలెక్టర్ సవివరంగా వివరించారు అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ...పని ప్రదేశాల్లో మహిళలపై లైంగిక వేధింపుల (నివారణ, నిషేధం, సంస్కరణ) చట్టం, 2013 అనేది మహిళల కు కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నుంచి రక్షణ కలిగించటానికి ఏర్పడ్డ చట్టమని.... దీనిపైన మహిళా ఉద్యోగులు తప్పనిసరిగా పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు ప్రతీ కార్యాలయం లో స్త్రీలకు భయరహితమైన, సమానమైన, గౌరవప్రదమైన పని వాతావరణం ఉండాలన్నారు ప్రతీ ఆఫీస్ లో ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీ ఉండాలని... లైంగిక వేధింపులు ఎదుర్కునే బాధితులు మౌనం గా ఉండకూడదని... ఈ చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు ఒకవేళ సంస్థలో అంతర్గత కమిటీ లేకపోతే లేదా ఉన్నతాధికారులపై ఫిర్యాదు చేయాల్సి వస్తే, భారత ప్రభుత్వం SHEBox పోర్టల్ (లైంగిక వేధింపుల ఎలక్ట్రానిక్ బాక్స్) ద్వారా నేరుగా ఫిర్యాదు చేసే సదుపాయాన్ని కల్పించిందన్నారు .మన జిల్లా కి సంబందించిన కమిటీ లను ఆన్లైన్ లో అప్లోడ్ చేయడం జరిగిందన్నారు సకాలంలో బాధిత మహిళ తన ఫిర్యాదు ను ఇవ్వాలని...నిష్పక్షపాతంగా, గోప్యంగా విచారణ జరుగుతుందన్నారు మహిళలపై జరిగే లైంగిక వేధింపుల చర్యలను నివారించడం, నిషేధించడం, పరిష్కరించడం ద్వారా కార్యాలయాలను



మహిళలకు సురక్షితంగా మార్చే లక్ష్యంతో రూపొందించిన ఈ చట్టం మహిళలకు ఒక మంచి అవకాశమన్నారు పని ప్రదేశాల్లో మహిళ లు ప్రశాంతంగా తమ విధులు ను నిర్వర్తించి నప్పుడే... కుటుంబ బాధ్యతలలో పూర్తి స్థాయిలో నిమగ్నమవుతారన్నారు ఇన్చార్జ్ డి డబ్ల్యు ఓ స్వరూప మాట్లాడుతూ... సమాజ అభివృద్ధి కి,మహిళల భద్రత,గౌరవం, స్వేచ్ఛ చాలా కీలకమని తెలిపారు మహిళలు భయభ్రాంతులు లేకుండా జీవించే వాతావరణం కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు మహిళను గౌరవించడం మన సంస్కృతి, మహిళలు సురక్షితంగా ఉంటేనే కుటుంబం సురక్షితంగా సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు అందుకే ప్రతి ఒక్కరు..మహిళల పట్ల గౌరవభావంతో ప్రవర్తించి వేధింపులను అరికట్టేందుకు ముందుకు రావాలన్నారు ఈ సమావేశం లో డిఆర్ఓ అంబదాస్ రాజేశ్వర్ , ఇన్చార్జి జిల్లా సంక్షేమ అధికారి స్వరూప, వివిధ శాఖలకు చెందిన జిల్లా, మండల, గ్రామ స్థాయి మహిళా ఉద్యోగులు పాల్గొన్నారు

# ఘనంగా బీరప్ప కామరతి కళ్యాణ మహోత్సవ వేడుకలు


**సిద్దిపేట టైమ్స్,కోహెడ:**

కోహెడ మండల పరిధిలోని నకిరేకొమ్ముల గ్రామంలో శ్రీశ్రీ బీరప్ప కామరాతి కళ్యాణ మహోత్సవం వేడుకలు కురుమ సంఘం అధ్యక్షుడు గుడ్ల శంకర్ ఆధ్వర్యంలో బుధవారం అత్యంత వైభవంగా జరిగాయి.ఈ సందర్భంగా కురుమ సంఘం మండల అధ్యక్షులు చుక్క అశోక్,కురుమ సంఘం గౌరవాధ్యక్షులు కొమురవెల్లి దేవస్థానం సిగిరి కొమురయ్య తంగళ్ళపల్లి మాజీఎంపీటీసీ కోనే శేఖర్ కురుమ,మండల కురుమ సంఘం నాయకులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించగా అతిధులను శాలువాలు కప్పి ఘనంగా సత్కరించారు.అనంతరం అతిధులు మాట్లాడుతూ కురుమల అతి పెద్ద పండుగ తమ ఆరాధ్య దైవం బీరప్ప స్వామి అని తెలిపారు.బీరప్ప కళ్యాణ మహోత్సవ వేడుకలు ప్రతి 5సంవత్సరాలకు ఒకసారి ఘనంగా నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు.గ్రామంలో గత వారం రోజులుగా పండగ వాతావరణంలో పోచమ్మ బోనాలు,రఘు బోనం,గంగ బోనం,లింగాలు తీయడంతోపాటు బీర్ల పూజారులతో వీరగంధ వేషధారణలతో గ్రామం మొత్తం ఆకట్టుకుంటుందన్నారు.లగ్గం బోనాలు ఊరేగింపుగా మహిళలంతా నెత్తి పైన బోనాలు ఎత్తుకొని బీర్ల డోలు నృత్యాలతో బీరప్ప గుడికి చేరుకొని మొక్కలు చెల్లించుకున్నారని చెప్పారు.బుధవారం నాగవెల్లి పట్నం,గురువారం ఎట్టి ముల్లెలు మోయడం శుక్రవారం రతి పోయడంతో పండుగ ముగుస్తుందన్నారు.ఇంత మంచి కార్యక్రమం నిర్వహిస్తున్న గ్రామ కురుమ సంఘం సభ్యులపై,గ్రామస్తులందరిపైన బీరప్ప కామరాతి ఆశీస్సులు ఉండాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్,ఉపసర్పంచ్, కురుమ సంఘం మండల ప్రచార కార్యదర్శి పరివేద సర్పంచ్ మీస కొమురయ్య,కోశాధికారి అమ్మ రాజ్




అనిల్,సంయుక్త కార్యదర్శి ఈరు రాజయ్య,డైరెక్టర్లు దయ్యాల రాజయ్య,గుడ్ల సమ్మయ్య,గుడ్ల అశోక్,గ్రామ కురుమ సంఘం నాయకులు గుడ్ల సారయ్య,గుడ్ల రామయ్య,గుడ్ల పెద్ద సమ్మయ్య,చిన్నసమ్మయ్య,గౌడ రవి,భక్తులు వివిధ గ్రామాల నుంచి విచ్చేసిన కుల బాంధవులు తదితరులు పాల్గొన్నారు.






# అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేస్తాం

**- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**
**- రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దు**
**- ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించాలి**
**ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి**
**- ధాన్యం కొనుగోళ్లపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన పౌరసరఫరాల శాఖ మంత్రి**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి మే 27**

అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామని, రైతుల ఎలాంటి ఆందోళన చెందవద్దని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం, ధాన్యం కొనుగోళ్లపై హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఇతర సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి మెదక్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు,అదనపు కలెక్టర్ నగేష్, జిల్లా పౌరసరఫరాల, డిఆర్డిఓ, అగ్రికల్చర్, ట్రాన్స్పోర్ట్ అధికారులతో కలసి పాల్గొన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఈ యాసంగి సీజన్‌లో అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని కూడా రైతులకు నష్టం కలగకుండా ప్రభుత్వ మద్దతు ధర (MSP)కు కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతులు ఇబ్బందులు పడకుండా కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. కొనుగోలు చేసిన తడిసిన ధాన్యాన్ని వెంటనే బాయిల్డ్ రైస్ మిల్లులకు తరలించేలా సమన్వయం చేసుకోవాలని, నిల్వలు పేరుకుపోకుండా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైనన్ని వాహనాలు, హమాలీలను అందుబాటులో ఉంచుకొని, ధాన్యం తరలింపు ప్రక్రియను నిరంతరాయంగా కొనసాగించాలని, వీలైనంత త్వరగా కొనుగోళ్లు పూర్తి చేయాలని సూచించారు. అవసరమైతే ఇసుక రవాణాకు వినియోగించే లారీలను, డీసీఎం, ట్రాక్టర్ లను కూడా ధాన్యం రవాణాకు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు అదనపు హమాలీల ద్వారా లోడింగ్, అన్‌లోడింగ్ పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. యాసంగి పంటకు రాష్ట్రంలో ఎక్కడా జరగని స్థాయిలో కొనుగోళ్లు జరుగుతున్నాయని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి గింజను కొనుగోలు చేసే దిశగా అధికారులు పూర్తి స్థాయిలో పనిచేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లపై ప్రత్యేక దృష్టి సారించి, త్వరితగతిన కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసి, రైతులకు మేలు చేకూర్చాలని అధికారులకు సూచించారు. అకాల వర్షాలు, వాతావరణ మార్పుల నేపథ్యంలో ధాన్యం తడిసిపోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. వాతావరణ శాఖ జారీ చేసే హెచ్చరికలను వెంటనే కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు చేర వేసి, అప్రమత్తం చేయాలని ఆదేశించారు. వర్ష సూచనలు ఉన్న సందర్భాల్లో టార్పాలిన్లు, నిల్వ సదుపాయాలు, రవాణా వాహనాలు సిద్ధంగా ఉంచి ధాన్యాన్ని సురక్షితంగా తరలించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ.. రైతులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రతి కేంద్రంలో పర్యవేక్షణ బలోపేతం చేసి, ధాన్యం కొనుగోళ్లు సకాలంలో పూర్తయ్యేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో *జిల్లా కలెక్టర్ * మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు, రవాణా ప్రక్రియ వేగంగా పూర్తి



చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు. అదనపు లారీలను కేటాయించి వెంటనే హమాలీల ద్వారా లోడింగ్ చేసి, దిగుమతి అయ్యేలా పటిష్ట చర్యలు తీసుకుం టున్నట్లు స్పష్టం చేశారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు. నిత్యానంద్, జగదీష్, జిల్లా రవాణా శాఖ అధికారి వెంకటస్వామి, డిఆర్డిఓ శ్రీనివాసరావు, డీఎస్పీ ప్రసన్నకుమార్ డి సి ఓ కరుణాకర్, జిల్లా వ్యవసాయ అధికారి దేవకుమార్,. తదితరులు పాల్గొన్నారు





# దిగుమతి యుద్ధ ప్రాతిపదికన చేయాలి

**- మిల్లర్లకు కలెక్టర్ హైమావతి ఆదేశం**

**సిద్దిపేట టైమ్స్ చేర్యాల ప్రతినిధి :**

మిల్లుల్లో వరి ధాన్యం దిగుమతి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ హైమావతి మిల్లుల యజమానులను ఆదేశించారు. బుధవారం మండలంలోని వీరన్నపేట గ్రామ శివ సాయి బాలాజీ రైస్ మిల్, ముస్త్యాల గ్రామ శివారులోని శ్రీ రేణుక బాయిల్డ్ రైస్ ఇండస్ట్రీలో దిగుమతి ప్రక్రియను పరిశీలించి మాట్లాడుతూ మిల్లులలో దాదాపు 30 వాహనాల ధాన్యం దిగుమతికి తయారుగా ఉందని వాటిని వెంటనే దిగుమతి చేసుకోవాలని జాప్యం కావడం వల్ల కొనుగోలు కేంద్రాలకు లారీల కొరత ఏర్పడుతుందని ఎక్కువ పాయింట్లు పెట్టి దిగుమతి ప్రక్రియ వేగవంతం చేయాలని అన్నారు. గ్రామాల్లో పని చేసే హమాలీలను సమకూర్చుకొని ఎక్కడి వారు అక్కడే పని చేస్తే దిగుమతి ఆలస్యం కాదని అలాగే ధాన్యం దిగుమతికి గోదాములను అన్వేషణ చేయాలని తహసిల్దార్ ను కలెక్టర్ ఆదేశించారు. దిగుమతి కాగానే మిల్లర్ అకనాలెడ్జ్మెంట్, ట్రక్ షీట్ జనరేట్, ఓపిఎంఎస్ అప్లోడ్ పెండింగ్లో ఉండకుండా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ దిలీప్ కుమార్ కలెక్టర్ వెంట ఉన్నారు.

# మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం

**-మతిస్థిమితం లేని వ్యక్తికి సేవా**
**– కొత్త బట్టలు అందజేత**
**- పాలకేంద్ర యజమాని స్వామి**

**దౌల్తాబాద్ మే 27( సిద్దిపేట టైమ్స్):**

గత కొన్ని సంవత్సరాలుగా మండల కేంద్రమైన దౌల్తాబాద్‌లో కడియాల నర్సింలు అనే మతిస్థిమితం లేని వ్యక్తి జీవనం కొనసాగిస్తున్నాడు. ఇతను ఎవరైనా భోజనం పెడితే తింటూ, లేకపోతే ఆ పూట పస్తులతోనే రోజులు గడుపుతున్నట్లు స్థానికులు తెలిపారు.ఈ నేపథ్యంలో బుధవారం మండల పరిధిలోని గువ్వలేగి గ్రామానికి చెందిన శ్రీ బాలాజీ పాలకేంద్రం యజమాని (స్వామి) మానవతా దృక్పథంతో స్పందించారు. రెండు రోజులుగా ఒంటిపై చొక్కా లేకుండా దయనీయ స్థితిలో ఉన్న నర్సింలు ను గమనించిన ఆయన వెంటనే అతనికి జుట్టు కటింగ్ చేయించి, స్నానం చేయించి, కొత్త బట్టలు అందజేశారు. ఈ సేవా కార్యక్రమం ద్వారా అతనికి తాత్కాలిక ఉపశమనం



కలిగిందని స్థానికులు తెలిపారు.ఈ కార్యక్రమం లో ముత్యంగారి బీజేపీ రాములు, మంగలి మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



# ఏడుపాయల వన దుర్గా భవాని అమ్మ వారిని దర్శించుకున్న మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ దంపతులు

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి మే 27**

మెదక్ జిల్లా, పాపన్నపేట మండలం, నాగ్సాన్ పల్లి: బుధవారం నాడు మెదక్ జిల్లా ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీ ఏడుపాయల వన దుర్గా భవాని దేవస్థానాన్ని *మెదక్ శాసనసభ్యులు డా. మైనంపల్లి రోహిత్ తమ సతీమణితో కలిసి దర్శించుకున్నారు.ఆలయంలో అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు.ఈ సందర్భంగా డా. మైనంపల్లి రోహిత్ గారు మాట్లాడుతూ, "ఏడుపాయల అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని, జిల్లా అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని



కోరుకుంటున్నాను. దేవస్థాన అభివృద్ధికి, భక్తుల సౌకర్యాలకు ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తాం" అని తెలిపారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, మరియు మండల అధ్యక్షులు మున్సిపల్ చైర్మన్ లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్స్ దేవస్థాన కార్యనిర్వహణాధికారి, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.






# వరి ధాన్యాన్ని వెంటనే అన్లోడ్ చేయాలి

**- కన్జ్యూమర్ అసోసియేషన్ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు పాతూరి వెంకటరెడ్డి**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, మే 27**

అకాల వర్షాల కారణంగా మార్కెట్ యార్డుల్లో ఉన్న వరి ధాన్యం తడిసి ముద్దవుతోందని, మిల్లర్లు త్వరితగతిన ధాన్యాన్ని అన్లోడ్ చేయకపోవడం వల్ల రైతులు తీవ్ర నష్టాలు ఎదుర్కొంటున్నారని కన్జ్యూమర్ అసోసియేషన్ రైతు విభాగం జిల్లా అధ్యక్షులు పాతూరి వెంకటరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం, సివిల్ సప్లైస్ అధికారులు మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకుని, మార్కెట్ యార్డుల్లో ఉన్న ధాన్యాన్ని వెంటనే అన్లోడ్ చేయించేలా చర్యలు చేపట్టి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు.

అలాగే మార్కెట్లలో ఉన్న సన్‌ఫ్లవర్ పంటను పూర్తి స్థాయిలో కొనుగోలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఆయన విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే కొనుగోలు చేసిన సన్‌ఫ్లవర్, మొక్కజొన్న పంటలకు సంబంధించిన చెల్లింపులు రెండు నెలలు గడిచినా రైతులకు అందలేదని, దీంతో రైతులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.కావున ప్రభుత్వం వెంటనే పెండింగ్‌లో ఉన్న డబ్బులను రైతుల ఖాతాల్లో జమ చేసి వారిని ఆదుకోవాలని పాతూరి వెంకటరెడ్డి డిమాండ్ చేశారు.



## జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని డిప్యూటీ తహసిల్దార్ కు వినతి పత్రం

**- బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాగి రాములు**

**సిద్దిపేట్ టైమ్స్ రామాయంపేట మే 27 ***

రామాయంపేట మండల కేంద్రంలో జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ బిజెపి మండల ప్రధాన కార్యదర్శి ఆర్.దిలీప్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం నాడు రామయంపేట డిప్యూటీ తహసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రాగి రాములు మాట్లాడుతూ రామాయంపేట మండల పరిధిలోని దంతేపల్లి,కాట్రియాల్, పర్వతాపూర్,కాట్రియల్ తండాల తో పాటు పలు గ్రామాలలో రబీ సీజన్లో విరివిగా జొన్న పంట పండించడం జరిగిందని జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని అదనపు కలెక్టర్ నగేష్ కు వినతిపత్రం అందజేశామని ఇప్పటివరకు జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయలేదని ఆయా గ్రామాల ప్రజల సౌకర్యార్థం జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి జొన్న పంట పండించిన రైతులను ఆదుకోవాలని కోరుతున్నామని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. జొన్నల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి జొన్నలకు రైతులకు మద్దతు ధర కల్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో దంతేపల్లి సర్పంచ్ మస్కూరి బాలరాజు, అక్కన్నపేట సర్పంచ్ బక్కయ్య గారి యాదగిరి, రాయిలాపూర్ ఉపసర్పంచ్ ప్రశాంత్, బిజెపి సీనియర్ నాయకులు సిద్ధిరాములు, రామాయంపేట పట్టణ మాజీ అధ్యక్షుడు భానుచందర్, అధ్యక్షులు నాగరాజు, ఓబీసీ మోర్చా జిల్లా నాయకులు నవత్ రాజేంద్రప్రసాద్ తదితరు బిజెపి నాయకులు పాల్గొన్నారు



## శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ ఎమ్మెల్యే జీఎంఆర్ కృతజ్ఞతలు

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**

వివాహ వార్షిక మహోత్సవ సందర్భంగా తమకు శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) బుధవారం రాత్రి కృతజ్ఞతలు తెలిపారు. మా వివాహ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యక్షంగా ఫోన్ కాల్స్ ద్వారా మరియు సామాజిక మాధ్యమాల ద్వారా ప్రేమతో శుభాకాంక్షలు తెలిపిన నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు,బంధువులు, మిత్రులు, అభిమానులందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నానని ఎమ్మెల్యే అన్నారు. మీ అందరి ఆశీస్సులు, ప్రేమాభిమానాలు మాకు ఎంతో ఆనందాన్ని మరింత ఉత్సాహం ఇచ్చాయన్నారు. ఇలాగే మీ ప్రేమ, ఆదరణ ఎల్లప్పుడు మాపై ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నారు. మీ అభిమానానికి ఎల్లప్పుడూ తాను రుణపడి ఉంటానని ఎమ్మెల్యే జిఎంఆర్ అన్నారు.

# తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం – రైతులకు కలెక్టర్ భరోసా

- వాతావరణ ప్రతికూల ప్రభావంతో అకాల వర్షా లు
- కుల్చారం, కౌడిపల్లి, టేక్మాల్, శంకరంపేట (ఎ) మండలాల్లో అధిక వర్షపాతం
- ప్రభుత్వ యంత్రాంగం క్షేత్రస్థాయిలో. (04) వేల క్వింటాళ్ల తడిచిన ధాన్యం ఉన్నట్లు నివేదికలు
- బాయిల్డ్ మిల్లులకు తరలించే విధంగా చర్యలు
- 59 వేల 227 మంది రైతులు నుండి
- 2,76,776.600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు
- 39,879 రైతులకు గాను. 441.15 కోట్ల రూపాయలు ఎకౌంట్లోలో జమ
- 18 సెంటర్లలో ధాన్యం కొనుగోలు పూర్తిచేసుకుని ముగించడం జరిగింది
- రైతులు అధైర్యపడవద్దు
- ధాన్యం తరలింపును త్వరగా పూర్తి చేయాలి
- రైతులకు ఇబ్బందులు లేకుండా వేగంగా కొనుగోళ్లు చేపట్టాలి
- హమాలీలను పెంచి లోడింగ్, అన్లోడింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలి
- టోకెన్ల వారీగా కొనుగోళ్లు పారదర్శకంగా నిర్వహించాలి
- ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రిజిస్టర్లు, ట్రక్ షీట్, ఓపీఎంఎస్ నమోదులు పటిష్టంగా జరగాలి
- జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి మే 27

తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేస్తాం - రైతులకు కలెక్టర్ భరోసా కల్పిస్తూ వాతావరణ ప్రతికూల ప్రభావంతో అకాల వర్షాలు పడుతున్నాయని ,రైతులు అధైర్యపడవద్దు ప్రభుత్వ యంత్రాంగం అండగా ఉందని క్షేత్రస్థాయిలో. తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతి మాసింగ్. అధికారులను ఆదేశించారు. మంగళవారం, కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి అదనపు కలెక్టర్ నగేష్ జిల్లాలోని తాసిల్దార్లు ఆర్డీవోలు, ఎంపీడీవోలు, జిల్లా పౌరసరఫరాల అధికారులతో కలిసి కలెక్టర్ గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాతావరణ ప్రతికూల ప్రభావంతో. జిల్లాలో వర్షం. పడడం జరిగిందని ప్రభుత్వ యంత్రాంగం క్షేత్రస్థాయిలో. (04) వేల క్వింటాళ్ల తడిచిన ధాన్యం ఉన్నట్లు నివేదికలు అందించడం జరిగిందన్నారు. కుల్చారం, కౌడిపల్లి, టేక్మాల్, శంకరంపేట,( ఏ) మండలాల్లో అత్యధిక వర్షపాత నమోదయిందని ఈ మండలాల్లో ధాన్యం కేంద్రాలలో తడిచినట్లు వివరించారు. తడిసిన ధాన్యానికి కొనుగోలు చేసే విధంగా బాయిల్డ్ మిల్లులకు తరలించేలా చర్యలు తీసుకుంటామని రైతులెవరు అధైర్యపడవద్దని కలెక్టర్ తెలిపారు ఇప్పటివరకు 59 వేల 227 మంది రైతులు నుండి 2,76,776.600 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి . 39,879 రైతులకు గాను. 441.15 కోట్ల రూపాయలు ఎకౌంట్లోలో జమ చేశామని,18 సెంటర్లలో ధాన్యం కొనుగోలు పూర్తిచేసుకుని ముగించడం జరిగిందని వివరించారు. వాతావరణ ప్రతికూల ప్రభావం నేపథ్యంలో రైతులకు ఎప్పటికప్పుడు వాతావరణ పరిస్థితులను అవగాహన కల్పిస్తూ ధాన్యం వర్షానికి తడవకుండా రక్షించుకునే విధంగా టార్పోలిన్స్ అందుబాటులో ఉంచాలన్నారు.కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని ఎగుమతి వేగాన్ని పెంచి త్వరితగతిన పూర్తి చేయాలన్నారు . అకాల వర్షాలతో ధాన్యం తడవకుండా రైతులకు టార్పాలిన్స్ అందుబాటులో ఉంచామని చెప్పారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో టోకెన్ జారీ నుంచి మిల్లులకు తరలింపు వరకు ప్రతి అంశాన్ని పారదర్శకంగా నమోదు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.. టోకెన్ పొందిన రైతుల సంఖ్య, ప్రతి టోకెన్‌కు అనుగుణంగా ఎన్ని లారీలు, ట్రాక్టర్లు పంపించారో స్పష్టమైన రికార్డులు నిర్వహించాలని సూచించారు. ధాన్యం నిల్వలు, గన్ని సంచుల లభ్యత, కాంటా పూర్తయిన తర్వాత మిగిలి ఉన్న ధాన్యం బస్తాల వివరాలు, రిజిస్టర్ నిర్వహణ, తదితర అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు ప్రతి మిల్లుకు ఏ సమయానికి వాహనాలు బయలుదేరాయో, ఇప్పటివరకు మొత్తం ఎన్ని లారీలు వెళ్లాయో, ట్రక్ షీట్‌లో నమోదు చేసిన వివరాలు సరిపోలేలా చూడాలని తెలిపారు. కేంద్రాల్లో ప్రస్తుతం ఎన్ని కళ్లాల్లో ధాన్యం నిల్వలో ఉందో, ఎన్ని వాహనాల ఎంట్రీలు నమోదయ్యాయో కూడా నిరంతరం నవీకరణ చేయాలని ఆదేశించారు. ధాన్యం తేమ (Moisture) శాతాన్ని టోకెన్ వారీగా నమోదు చేసి, నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కొనుగోలు ప్రక్రియలో ఎటువంటి వ్యత్యాసాలు లేకుండా అధికారులు పర్యవేక్షణ చేయాలన్నారు. ఈ గూగుల్ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, ఆర్డీవోలు, మెదక్ రమాదేవి, తూప్రాన్ జై చంద్రారెడ్డి, నర్సాపూర్ రామకృష్ణ, జిల్లా పౌరసరఫరాల అధికారులు నిత్యానంద్, జగదీష్, తాసిల్దార్లు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు

# బక్రీద్ సందర్భంగా మెదక్ పట్టణంలో భారీ ఫ్లాగ్ మార్చ్

**- శాంతియుత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి : అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి మే 27**

బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలను కట్టుదిట్టం చేసిన పోలీసులు బుధవారం సాయంత్రం మెదక్ పట్టణంలో భారీ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. మెదక్ అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఫ్లాగ్ మార్చ్‌లో పోలీసు అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రజల్లో భద్రతా భావన కల్పించారు.మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ నుండి ప్రారంభమైన ఫ్లాగ్ మార్చ్ అంబేద్కర్ చౌరస్తా, రాందాస్ చౌరస్తా, పొట్టి శ్రీరాములు విగ్రహం, చామన్ ప్రాంతాల మీదుగా తిరిగి టౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకుంది. ఫ్లాగ్ మార్చ్ సందర్భంగా ప్రధాన కూడళ్లు, సున్నిత ప్రాంతాల్లో పోలీసులు పహారా నిర్వహిస్తూ పరిస్థితులను సమీక్షించారు. పండుగ సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు .ఈ సందర్భంగా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ బక్రీద్ పండుగను ప్రజలు





శాంతియుతంగా, సామరస్య వాతావరణంలో జరుపుకోవాలని కోరారు. జిల్లాలో భద్రతా ఏర్పాట్లు కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని, ప్రజలు పోలీసులకు సహకరించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపించిన వెంటనే సమీప పోలీసు స్టేషన్‌కు లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులు, తప్పుడు ప్రచారాలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజల భద్రత కోసం పోలీసులు నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో మెదక్ డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు మహేష్, కృష్ణమూర్తి, శైలేందర్, రామకృష్ణ, ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు

# బక్రీద్ పండుగకు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు

**- స్పందనలో నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు**

**- పికెట్ సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలి : అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి మే 27**

బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసు శాఖ కట్టుదిట్టమైన బందోబస్త్ ఏర్పాట్లు చేపట్టిందని జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ తెలిపారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో బందోబస్త్ విధులకు హాజరైన పోలీసు సిబ్బందికి ప్రత్యేక బ్రీఫింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి సిబ్బంది తమకు కేటాయించిన డ్యూటీ పాయింట్లలో సమయానికి హాజరై అప్రమత్తంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శాంతిభద్రతలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. డయల్ 100 వాహనాలు అత్యవసర ఘటనలకు వేగంగా స్పందించాలని పేర్కొన్నారు. స్పందనలో నిర్లక్ష్యం వహించిన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పికెట్ విధుల్లో ఉన్న సిబ్బంది అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ఎలాంటి అనుమానాస్పద సంఘటనలు గమనించిన వెంటనే ఉన్నతాధికారులకు సమాచారం అందించాలని ఆదేశించారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో విధుల్లో ఉన్న సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలని, సమయానికి నీరు తాగుతూ జాగ్రత్తలు పాటించాలని సూచించారు. విధి నిర్వహణలో నిష్పక్షపాత ధోరణితో వ్యవహరించాలని తెలిపారు. కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్న కుమార్, సీఐలు సందీప్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రేణుక రెడ్డి, కృష్ణమూర్తి, మహేష్, రామకృష్ణ, శైలేందర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.





# పోలీసు ఉద్యోగ బాధ్యతల మధ్య కుమార్తెల భవిష్యత్తుకు బాటలు వేసిన నాన్న

**- తండ్రి కలలకు రూపం ఇచ్చిన కుమార్తెలు**

**- కష్టం, పట్టుదల ఉంటే ఏ లక్ష్యమైనా సాధ్యమే**

**- ప్రతి ఒక్కరికి స్ఫూర్తిగా నిలిచిన తాజుద్దీన్**

**- ఎంబీబీఎస్ పూర్తి చేసిన ఇద్దరు కుమార్తెలను ఘనంగా సన్మానించిన ఎస్పీ.డి. వి.శ్రీనివాస రావు**

**సిద్దిపేట్ టైమ్స్ మెదక్ ప్రతినిధి మే 27**

కలలు కనడం ప్రతి ఒక్కరికీ సాధ్యం... కానీ ఆ కలలను నిజం చేయడానికి జీవితాన్నే అంకితం చేసే తల్లిదండ్రులు చాలా అరుదు. అలాంటి ఓ తండ్రి కష్టం, పట్టుదల, త్యాగానికి ప్రతీకగా నిలిచిన సంఘటన మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయంలో హృదయాలను హత్తుకుంది.మనోహరాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎండీ తాజుద్దీన్ కుమార్తెలు డా. సమీరా సహేతాజ్, డా. సానియా సహేతాజ్‌లు ఎంబీబీఎస్ పూర్తి చేసిన సందర్భంగా మెదక్ జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు వారిని జిల్లా పోలీస్ కార్యాలయానికి ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. చిన్న గ్రామమైన చేగుంటలో జన్మించి, సాధారణ కుటుంబ పరిస్థితుల్లో పెరిగిన ఈ ఇద్దరు కుమార్తెలు స్థానిక పాఠశాలలోనే చదువుకుని, అనంతరం ఉన్నత చదువుల కోసం హైదరాబాద్ వెళ్లి కఠోర శ్రమతో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. గ్రామీణ ప్రాంతంలో పరిమిత వనరులు ఉన్నప్పటికీ పట్టుదలతో ముందుకు సాగి వైద్య విద్యను పూర్తిచేయడం ప్రతి విద్యార్థికి ఆదర్శంగా నిలుస్తుందని ఎస్పీ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ...పోలీసు ఉద్యోగం అంటే నిత్యం ఒత్తిడి, బాధ్యతలు, కుటుంబానికి దూరంగా సేవలు. అలాంటి పరిస్థితుల్లో కూడా తన కుమార్తెల భవిష్యత్తు కోసం ఎండీ తాజుద్దీన్ చేసిన కృషి అభినందనీయము. తండ్రి కలలను పిల్లలు నిజం చేసిన ఈ ఘటన ప్రతి కుటుంబానికి స్ఫూర్తిదాయకం అని అన్నారు. సన్మాన కార్యక్రమంలో మాట్లాడిన డా. సమీరా సహేతాజ్, డా. సానియా సహేతాజ్‌లు భావోద్వేగానికి గురయ్యారు. మా కలలను నిజం చేయడానికి మా నాన్న ఎన్నో కష్టాలు పడ్డారు. పని ఒత్తిడి ఎంత ఉన్నా, మమ్మల్ని చదివించాలనే తపన ఆయనలో ఎప్పుడూ తగ్గలేదు. హైదరాబాద్ నుంచి మెదక్ వరకు రాత్రింబవళ్లు ప్రయాణాలు చేసినా, అలసటను బయటపెట్టలేదు. మాకు ధైర్యం చెప్పి, ముందుకు నడిపించారు అని కన్నీటి కళ్లతో తెలిపారు. మా కోసం తన సంతోషాలను పక్కన పెట్టి, మా భవిష్యత్తు కోసం ప్రతి క్షణం కష్టపడ్డారు. ఈ రోజు మమ్మల్ని సమాజం డాక్టర్లు అని గౌరవిస్తే...ఆ గౌరవానికి అసలైన అర్హుడు మా నాన్నే. మా విజయాల వెనుక ఉన్న ప్రతి కష్టం ఆయనదే అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ శైలెందర్, ఆర్ఎసై నరేష్, రైటర్ శ్రవణ్, సిబ్బంది ఉన్నారు.









# ధాన్యం కొనుగోలు వేగవంతం – కాటన్ మిల్లులో నిల్వ ప్రక్రియ ప్రారంభం

*** లారీల కొరత నేపథ్యంలో రైతులకు ఊరట కలిగించేలా అధికారుల చర్యలు – ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సీఐ లతీఫ్ హామీ**

**దౌల్తాబాద్, మే 27 (సిద్దిపేట టైమ్స్):**

రాయపోల్, దౌల్తాబాద్ మండలాల్లో లారీల కొరత కారణంగా రైతులు పండించిన ధాన్యం రవాణా, కొనుగోలు ప్రక్రియలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం మొత్తం ధాన్యాన్ని పూర్తిగా కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, కొనుగోలు ఆలస్యంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ పలు గ్రామాల్లో ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించిన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో స్థానిక సీఐ లతీఫ్ రైతులతో చర్చించి, పండించిన ప్రతి ధాన్య గింజను పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తామని, ప్రక్రియను వేగవంతం చేస్తామని హామీ ఇచ్చారు.అందులో భాగంగా హైమద్ నగర్ లోని తిరుమల కాటన్ మిల్లులో ధాన్యం నిల్వ చేసే ప్రక్రియను మంగళవారం ప్రారంభించారు.బుధవారం ఉదయం నుండి దౌల్తాబాద్, రాయపోల్ మండలాల పరిధిలోని కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించిన ధాన్యాన్ని ఈ మిల్లులో నిల్వ చేసి కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయనున్నట్లు అధికారులు తెలిపారు.బుధవారం రైతులు తమ ధాన్యాన్ని ట్రాక్టర్లు, డీసీఎంల సహాయంతో మిల్లుకు తరలించి, క్రమపద్ధతిలో లైన్లలో నిలబడి ధాన్యం దింపే ప్రక్రియను కొనసాగిస్తున్నారు. ఈ చర్యలతో కొనుగోలు కేంద్రాలపై ఒత్తిడి తగ్గి రైతులకు కొంత ఊరట లభిస్తుందని అధికారులు పేర్కొన్నారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం

**- రైతులు ఆందోళన పడవద్దు**
**- తహసిల్దార్ రజనీకుమారి**

**సిద్దిపేట టైమ్స్ రామాయంపేట మే 27 ***

మంగళవారం నాడు కురిసిన అకాల వర్షాలతో రైతులు ఆందోళన చెందవద్దని రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కూడా కొనుగోలు చేస్తామని రామాయంపేట తహసిల్దార్ రజనీకుమారి అన్నారు. రామయంపేట మార్కెట్ యార్డులో పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె బుధవారం నాడు క్షేత్రస్థాయిలో సందర్శించారు. ధాన్యం కొనుగోళ్ల తీరును ఆమె పరిశీలించారు. కొనుగోలు కేంద్రంలో మరో మూడు లారీల ధాన్యం ఉన్నట్లు ధాన్యం కొనుగోలు నిర్వాహకులు ఆమె దృష్టికి తీసుకువచ్చారు. మరో మూడు లారీలు ఏర్పాటు చేస్తే దాన్యం కొనుగోలు పూర్తి అవుతాయని నిర్వాహకులు తహసిల్దార్ రజనీకుమారికి తెలియజేశారు. గన్ని బ్యాగులను అందుబాటులో ఉంచుకొని వరి ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలన్నారు. అలాగే మండల పరిధిలోని కోనాపూర్ గ్రామంలో గల గీత రైస్ మిల్ సందర్శించి కొనుగోలు కేంద్రాల నుండి వచ్చిన ధాన్యాన్ని త్వరగా అన్లోడింగ్ చేసుకోవాలని రైసుమిల్లలకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ రజనీకుమారి,ఆర్. ఐ.గౌస్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు






# జిల్లాస్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం



**- తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించాలి**
**- జూన్ 2న సిద్దిపేట అమరవీరుల స్థూపం వద్ద ఉద్యమకారుల భారీ సమీకరణకు పిలుపు**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, మే 27:**

తెలంగాణ రాష్ట్ర సాధన సంఘం ఆధ్వర్యంలో రాష్ట్ర సాధనలో క్రియాశీలకంగా పాల్గొన్న వివిధ సంఘాల ప్రతినిధులతో జిల్లా స్థాయి స్టీరింగ్ కమిటీ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని జూన్ 2న ఘనంగా నిర్వహించాలని నిర్ణయించారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో పోరాడిన ఉద్యమకారులు పెద్ద సంఖ్యలో పాల్గొని సిద్దిపేటలోని తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద జరిగే మహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తెలంగాణ కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవడం ప్రతి తెలంగాణ బిడ్డ బాధ్యత అని పేర్కొన్నారు.అలాగే రాష్ట్ర సాధనలో భాగస్వామ్యమైన ఉద్యమ శక్తులను ఒక వేదికపైకి తీసుకువచ్చి భవిష్యత్ కార్యాచరణపై సమన్వయంతో ముందుకు సాగేందుకు స్టీరింగ్ కమిటీ ఏర్పాటుచేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్టీరింగ్ కమిటీ సభ్యులు పాపయ్య సర్, సత్తయ్య సర్, తిరుపతి రెడ్డి సర్, ఖమ్మంపల్లి యాదగిరి, కర్రోళ్ల బాబు, పెద్ది రాజు, శ్రీహరి, కూతురు రాజిరెడ్డి, పంబాల ఎల్లయ్య సార్, ఎల్లారెడ్డి, ప్రవీణ్, కృష్ణ, మైసారెడ్డి, రమేష్, శ్రీనివాస్, మధుసూదన్ రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయాలి, సీపీఎం పార్టీ

**- రైస్ మిల్లర్ల, అధికారుల వల్లే రైతుల గోస , కామిని గోపాలస్వామి సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు**

**సిద్దిపేట టైమ్స్ బెజ్జంకి**

బెజ్జంకి మండల కేంద్రంలో సీపీఎం పార్టీ కార్యవర్గం సమావేశం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కాముని గోపాలస్వామి మాట్లాడుతూ బెజ్జంకి మండలంలో ధాన్యం కొనుగోలు నత్తనడకన సాగుతున్నయి వర్షం పడటంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది, తడిసిన ధాన్యాన్ని వెంటనే ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని సీపీఎం పార్టీ డిమాండ్ చేస్తోంది, రైస్ మిల్లర్లు , అధికారులు కలిసి రైతులను మోసం చేస్తున్న పరిస్థితి ఉంది, ఇప్పటికైనా అధికారులు రైతుల పక్షాన నిలబడాలని రైతుల ధాన్యం యుద్ధ ప్రాతిపదికన తరలించి రైతులను ఆదుకోవాలి, లేకుంటే సీపీఎం పోరాటం చేస్తుంది,రైస్ మిల్లర్లు రైతుల నుండి బస్తా వడ్లకు రెండు కిలోల చొప్పున అదనంగా తూకం వేయాలని ఒత్తిడి తెస్తున్నారు రైతులు దిక్కుతోచక ఆందోళన చెందుతున్నారు, ప్రభుత్వం అధికారుల తీరు రైతులను ముంచి రైస్ మిల్లర్లకు లాభం చేయాలని చూస్తున్నారు , ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేస్తున్నాం , ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి తిప్పారపు శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు బొమ్మిడి సాయికృష్ణ, సంఘ ఎల్లయ్య, బోనగిరి లింగం తదితరులు పాల్గొన్నారు





# తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా పండుగ ఘన విజయం

**- కల్వకుంట్ల కవిత ఆదేశాలతో రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా వేడుకలు**
**- మేడ్చల్ నియోజకవర్గంలో గద్దెల నిర్మాణం..**
**- రాష్ట్ర అబ్జర్వర్ భవానీ వేముల నేతృత్వంలో ఊరూరా ఎగిసిన టీఆర్ఎస్ జెండాలు**

**సిద్దిపేట టైమ్స్, మేడ్చల్ , మే 27:**

తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండా పండుగ రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా కొనసాగుతోంది. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున వేడుకల్లో పాల్గొంటున్నారు. తెలంగాణ వ్యాప్తంగా గ్రామాలు, పట్టణాల్లో ప్రత్యేకంగా గద్దెలు నిర్మించి పార్టీ జెండాలను ఆవిష్కరిస్తూ కార్యకర్తలు సంబరాలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా మేడ్చల్ నియోజకవర్గంలో టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అబ్జర్వర్ భవానీ వేముల నేతృత్వంలో నియోజకవర్గ ఇంచార్జీలు మేక లలిత యాదవ్, వెంకటేష్ ఆధ్వర్యంలో జెండా పండుగ విజయవంతంగా కొనసాగుతోంది. నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని పార్టీ పట్ల తమ ఐక్యతను చాటుతున్నారు. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత పిలుపుతో ఊరూరా, వాడవాడలా తెలంగాణ రక్షణ సేన పార్టీ జెండాలు ఎగురుతూ పండుగ వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. కార్యకర్తల ఉత్సాహం, ప్రజల భాగస్వామ్యంతో జెండా పండుగ రాష్ట్ర రాజకీయ వర్గాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.



# పిడుగు పాటుకు గర్భం దాల్చిన పాడి ఆవు మృతి

**సిద్దిపేట టైమ్స్ అక్బరుపేట/భూంపల్లి మే 27**

అక్బరుపేట భూంపల్లి మండలం ఏనుగుర్తి గ్రామంలో బుధవారం ఉదయం విషాదం చోటు చేసుకుంది. రైతు కమటం సత్యానంద్ కి చెందిన గర్భం దాల్చిన పాడి ఆవుపై పిడుగు పడి మృతి చెందింది.ఉరుములు మెరుపులతో కూడిన వర్షం కురిసిన సమయంలో ఈ ఘటన జరిగింది. ఈ సంఘటనతో రైతుకు సుమారు లక్ష రూపాయల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరారు.



# బెజ్జంకి మండల కేంద్రంలో ఘనంగా ప్రారంభమైన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం

**సిద్దిపేట టైమ్స్ బెజ్జంకి**

బెజ్జంకి మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నూతన కార్యాలయాన్ని మాజీ శాసనసభ్యులు, డా. రసమయి బాలకిషన్ ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని, కార్యకర్తలే పార్టీకి బలమని పేర్కొన్నారు.అనంతరం రాష్ట్రంలో ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీఆర్ఎస్ పార్టీ నిరంతరం పోరాటం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మండల నాయకులు, గ్రామ శాఖ అధ్యక్షులు, సర్పంచులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు."ప్రజల కోసం... ప్రజల మధ్యలోనే బీఆర్ఎస్" అంటూ నాయకులు నినాదాలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



# రైతుల ధాన్యం భద్రతకు మా ప్రభుత్వానిదే భాద్యత...

**- మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి..**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, మే 27**

రైతుల ధాన్యం భద్రతకు మా ప్రభుత్వానిదే భాద్యత అని నంగునూర్ మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి రైతులకు హామీ ఇచ్చారు.నిన్న రాత్రి కురిసిన అకాల వర్షలకు తడిసిన ధాన్యాన్ని,పరిశీలన కోసం ఈ రోజు మండలం లోని సిద్దన్నపేట, పాలమకుల, రాజగోపాల్ పేట, వెంకటాపూర్, గ్రామాలలోని కొనుగోలు కేంద్రాలను సందర్శించి రైతులకు పూర్తి భరోసా కల్పించారు.అకాల వర్షాలతో తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి గారు జిల్లా మండల అధి కారులు మొత్తం అప్రమత్తంగా ఉండి రైతులకు అండగా నిలువాలని కీలక సూచనలు చేశారాని పేర్కొన్నారు.వాతావరణ శాఖ పలు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైందన్నారు.ఈ క్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దేవులపల్లి యాదగిరి అధికారులతో కలిసి ధన్యనాన్ని గోదాములకు తరలించడానికి కృషి చేశారు.మండలం లో భారీ వర్షాలు, బలమైన ఈదురుగాలులపై అప్రమత్తంగా ఉండాలని. ప్రత్యేకంగా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా అదనపు ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేసి రైతులకు ఎలాంటి నష్టం కలగకుండా చూస్తామని మరోసారి హామీ ఇచ్చారు.కల్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యం వర్షానికి తడవకుండా అవసరమైన టార్పాలిన్లు అందు బాటులో ఉంచామన్నారు. ఇప్పటికే కొనుగోళ్లు పూర్తయిన కేంద్రాల నుంచి టార్పాలిన్లను ఇతర అవసరమైన.ప్రాంతాలకు తరలించామని పేర్కొన్నారు. రైతుల ధాన్యం భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఇస్తున్నామన్నారు. అలాగే వాతావరణ కేంద్రం బలమైన ఈదురుగాలుల హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు వెంటనే స్పందించేలా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుందని తెలిపారు. ప్రజలు అవసరం లేకుండా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని చైర్మన్ యాదగిరి సూచించారు.ఈ కార్యక్రమం లో రాజగోపాల్ పేట సర్పంచ్ చేర్యాల రాణి కృష్ణ,పాక్స్ డైరెక్టర్ గంగుల రవి, భాస్వరాజ్ రాములు,తిరుపతి,నర్సింహా రెడ్డి, రాజిరెడ్డి, మల్లారెడ్డి, ఏ టి చెంద్రం, లు పాల్గొన్నారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ

**- అల్లా దయతో ప్రజలందరూ సంతోషంగా ఉండాలి**
**- బక్రీద్ పండుగ శుభాకాంక్షలు**
**- వంగ రాజేశ్వర్ రెడ్డి**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, మే 27**



బక్రీద్ (ఈద్ ఉల్ అధా) పర్వదినం సందర్భంగా యువ నేత వంగ రాజేశ్వర్ రెడ్డి ముస్లిం సోదర,సోదరీమణులకు శుభాకాంక్షలు తెలిపారు. భక్తి,త్యాగానికి ప్రతీకగా నిలిచే ఈ పండుగ అందరి జీవితాల్లో సుఖశాంతులను నింపాలని ఆకాంక్షించారు.త్యాగం, సహనం బక్రీద్ పండుగ ఇచ్చే గొప్ప సందేశాలన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ ఎంతో భక్తి భావం,విశ్వాసం, కరుణ, ఐక్యతకు సాంకేతమైన ఈ పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలన్నారు.హజ్రత్ ఇబ్రహీం స్ఫూర్తిగా అందరూ సాటివారిని ఆదరిస్తూ సహృదయంతో ముందుకు సాగాలన్నారు.అల్లాహ్ ఆశీస్సులు ప్రజలందరికీ ఎల్లప్పుడూ ఉండాలని అభిలషించారు.ఈ సంవత్సరం హజ్ యాత్ర పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరికి ప్రత్యేక శుభాకాంక్షలు తెలుపుతున్నానన్నారు.అల్లా దయతో ప్రజలందరూ ఆరోగ్యంగా,సంతోషంగా ఉండాలని ప్రార్థిస్తున్నానన్నారు.

# తడచిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొంటాం..

**-దేవరకద్ర ఎమ్మెల్యే జిఎంఆర్**
**-రైతులు ఎవరు పడవద్దని సూచన**
**-రైతు సంక్షేమమే ధేయంగా పని చేస్తున్న ప్రజా ప్రభుత్వం**
**-బిఆర్ఎస్ నాయకుల అసత్య ఆరోపణలను నమ్మొద్దు**
**-మన పాలమూరు రైతు బిడ్డ రాష్ట్ర ముఖ్య మంత్రిగా ఉన్నారు**

**సిద్దిపేట టైమ్స్ దేవరకద్ర**



ధాన్యం కొనుగోలు విషయంలో రైతులు ఎవరు కూడా ఆ ధైర్యపడవద్దని మహబూబ్ నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జిఎంఆర్) హామీ ఇచ్చారు.బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏం పాలుపోక రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆయన విమర్శించారు. కొనుగోలు కేంద్రాలు, కల్లాల దగ్గర ఫొటోలకు పోజులు ఇస్తూ ప్రజా ప్రభుత్వంపై అడ్డగోలు ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే విమర్శించారు.

ఈ రోజు వరకు 54 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించి,దాదాపు రూ. 7,245 కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో నగదును ప్రభుత్వం జమ చేయడం జరిగిందన్నారు.ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డ రెండున్నరేళ్లలో అన్నదాతల సంక్షేమం కోసం ఒకేసారి 2 లక్షలు రైతు రుణమాఫీ చేశాం, పెట్టుబడి సహాయంగా రైతు భరోసా ఎకరాకు 12 వేలు అందిస్తు న్నామన్నారు.సన్నాలకు అదనంగా రూ.500/ బోనస్ ఇస్తున్నాం, కౌలు రైతులను ఆదుకుంటున్నాం,రైతు బీమా అందిస్తు న్నామన్నారు.కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేశాం,హమాలీల ,గన్ని బ్యాగుల కొరతలేకుండా ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షిస్తు న్నామన్నారు.తూకం వేసిన ధాన్యాన్ని వెంటనే ట్రాన్స్ పోర్ట్ వాహనాలద్వారా మిల్లులకు, గోదాములకు తరలిస్తున్నామన్నారు. స్వయంగా ముఖ్య మంత్రి ఈ విషయంలో హామీ ఇవ్వడం జరిగిందన్నారు. తడిసిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొంటాం అని ప్రతిపక్షాలు వదంతులను వ్యాప్తి చేయడం ఆపాలని ఎమ్మెల్యే జిఎంఆర్ సూచించారు.





# తోర్నాలలో మరొక తెలంగాణ తోరణ ద్వారం

**సిద్దిపేట టైమ్స్, నంగునూరు, మే 27:**

సిద్ధిపేట జిల్లా ధూళిమిట్ట మండలంలోని గ్రామం దోర్నాలలో తోరణ ద్వారాన్ని గుర్తించినట్లు నంగునూరుకు చెందిన ఔత్సాహిక చరిత్రకారుడు కొత్త తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు కొలిపాక శ్రీనివాస్ వెల్లడించారు. దోర్నాల అంటే పలుకుబడిలో మారిన సరళాదేశమైన 'తోరణాల' అని చెప్పారు. దోర్నాల(తోరణాల)కు ఆ పేరు రావడానికి కారణమైన 'దర్వాజ బండ' మీద ఒకప్పుడున్న తోరణద్వారమే అనే ఆధారాలను తన క్షేత్ర పరిశోధనలో గుర్తించినట్లు కొలిపాక శ్రీనివాస్ తెలిపారు. తోర్నాల గ్రామం బయట 'భోగం దాని ఉయ్యాల', లేదా 'దర్వాజ బండ' అని గ్రామ ప్రజలు పిలిచే పరుపుబండ ఉందన్నారు. ఈ బండ మీద ముక్కలై పడివున్న ఒక దర్వాజ(ద్వార బంధం) ఆనవాళ్ళు కనిపిస్తున్నాయన్నారు. వీటిని పరిశీలిస్తే చాలా వెడల్పు, ఎత్తున్న రాతి దర్వాజ ఇక్కడ వుండేదని దానికి తోరణ ద్వారాలకు తామర మొగ్గల వంటి డ్రాప్స్ వంటివి విరిగిపడి ఉన్న రాతి దూలానికి కనిపిస్తున్నాయని చెప్పారు. తోరణ ద్వార బంధం ద్వార శాఖల(శేరెడు)కు కిందివైపు కలశాలు చెక్కి ఉన్నాయని తెలిపారు. అచ్చం ఇదేవిధంగా కొలనుపాక సోమేశ్వరాలయం ముందున్న వారసత్వ శాఖ మ్యూజియం తోరణద్వారానికి కూడా రెండు వైపుల కలశాలు చెక్కివున్నాయని అన్నారు. అలాగే మరొక తోరణ ద్వారానికి 'రాజ దర్వాజ' అని పేరు ఉందని అలానే తోర్నాలలో 'తోరణద్వారం' అనే ఈ దర్వాజ కూడా తిరిగి నిలబెట్టలేని విధంగా ముక్కలై పడివుందని చెప్పారు.







# రైతులను రెచ్చ గొట్టి రాజకీయ పబ్బం గడుపుకోవడమే హరీష్ రావ్ లక్ష్యం

**- హరీష్ రావ్ నోరు అదుపులో పెట్టుకో సీఎం రేవంత్ రెడ్డినీ విమర్శిస్తే చూస్తూ ఊరుకోం**
**- బాల్క సుమన్ పై రాజా ద్రోహం కేసు పెట్టాలి**
**- రైతులు అధైర్య పడొద్దు చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది**
**- AMC చైర్మన్ లు మీసం మహేందర్ యాదవ్, దేవులపల్లి యాదగిరి**

**సిద్దిపేట టైమ్స్, సిద్దిపేట, మే 27**

గతంలో 10 ఏండ్లు brs ప్రభుత్వంలో వడ్లు కొనలేక రైతుల వర్షానికి వడ్లు తడిచి మొలకలు వచ్చి అన్న మోరామచంద్ర అంటూ రైతులు బతిమాలిన రెండు సార్లు మంత్రిగా ఉండి నియోజకవర్గంలో ఏనాడు ఏ ఒక్క వడ్ల కొనుగోలు సెంటర్ అయినా సందర్శించి రైతుల సమస్యలు పట్టించుకొని హరీష్‌రావు ఇప్పుడు అధికారం కోల్పోయాక రైతులపై ముసలి కన్నీరు కారుస్తూ రైతులను రెచ్చగొట్టడం సిగ్గుచేటు అన్నారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మీసం మహేందర్ మాట్లాడుతూ చిన్నకోడూరు మండల కేంద్రంలోని మార్కెట్ యార్డ్ లో కొనుగోలు సెంటర్ ను సందర్శించిన హరీష్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్య మంత్రినీ పట్టుకొని రైతుల సమక్షంలో రేవంత్ రెడ్డి గాడు అని సంభోదించడాన్ని తీవ్రంగా ఖండించారు హరీష్ రావు నోరు అదుపులో పెట్టుకో నీ బతుకు రేవంత్ రెడ్డి కాలు గోటికి కూడా సరిపోదన్నారు. వెంటనే సీఎం రేవంత్ రెడ్డి గారికి క్షమాపణలు చెప్పకపోతే హరీష్ రావు నియోజకవర్గంలో ఎక్కడ తిరగనియ్యబోమని హెచ్చరించారు. అంతేకాకుండా చెన్నూరు నియోజకవర్గంలో జరిగిన BRS కార్యకర్తల మీటింగ్లో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మాట్లాడుతూ రైతులను రెచ్చగొట్టండి రోడ్లమీద ధర్నాలు చేయించండి మిలటెంట్ల లాగా మారి రైలు పట్టాలను కోసేయండి సింగరేణి ఆఫీసులను తగలబెట్టండి అని తమ కార్యకర్తలను రెచ్చగొట్టిన విషయంపై స్పందిస్తూ బాల్క సుమన్ పై రాజా ద్రోహం కేసు నమోదు చేయాలన్నారు. ఈ బిఆర్ఎస్ నాయకులు కల్వకుంట్ల కుటుంబం తెలంగాణ ఉద్యమంలో కూడా యువకులను రెచ్చగొట్టి ఆత్మబలిదానం చేసుకునేలా ప్రోత్సహించి వారి చావుకు కారణమై కల్వకుంట్ల కుటుంబాన్ని బంగారుమయం చేసుకున్న విషయాన్ని గుర్తుచేసారు. రైతులెవరు అధైర్య పడగొద్దని తడిసిన చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమం sc సెల్ జిల్లా కన్వీనర్ పొన్నాల రాజేష్, యూత్ కాంగ్రెస్ చిన్నకోడూరు మండల మాజీ అధ్యక్షులు ఉడుతా జయంత్ తదితరులు పాల్గొన్నారు.




# వర్షానికి తడిసి ముద్దయిన ధాన్యం





**సిద్దిపేట టైమ్స్, నంగునూరు, మే 27w**

మంగళవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. ఈ వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయింది. కొనుగోళ్లలో ఆలస్యం, తూకం వేసిన బస్తాల తరలింపులో నిర్లక్ష్యం వల్ల కొనుగోలు కేంద్రాలలో ధాన్యం కుప్పలు పేరుకు పోయాయి. బస్తాలను రోజుల తరబడి కేంద్రాలలో వదిలేయడంతో చాలా చోట్ల బస్తాలు చెదలు పడుతోంది. దీనికి తోడు మంగళవారం కురిసిన వర్షానికి కేంద్రాల్లోని ధాన్యం తడిసి పోయింది. రాజగోపాలపేట బండపై ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ధాన్యం వర్షానికి కొట్టుకు పోయింది. దీంతో రైతులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. సిద్ధన్నపేటలోని నంగునూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో వడ్లు, మొక్కజొన్నల రాశులతో సందు లేకుండా ఉంది. రాత్రి కురిసిన వర్షానికి నీళ్ళు రాశుల మధ్య నిలిచి తొలగించడానికి వీలు లేకుండా మారింది. దీంతో వడ్ల కుప్పలు, మొక్కజొన్నల కుప్పల కిందికి నీరు చేరింది. నంగునూరులో తోకల బండపై ధ్యానం వానకు కొట్టుకు పోయింది. గట్లమల్యాల, తిమ్మాయిపల్లి, అంక్షాపూర్ తదితర గ్రామాలలో గ్రామాలలో ధాన్యం పూర్తిగా తడిచి పోయిందని రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్తాలలో నింపి ధాన్యం పూర్తిగా తడిచిపోయింది. మామిడి తోటల్లో మామిడి కాయలు రాలి పోయాయి. వర్షంతో కూడిన ఈదురు గాలులకు అంక్షాపూర్ గ్రామానికి చెందిన నమిలే రాజిరెడ్డికి చెందిన ఇంటి రేకులు పూర్తిగా లేచిపోయాయి. తిమ్మాయపల్లిలో మోత్కు కరుణాకర్ అనే రైతుకు చెందిన పశువుల పాక కూలిపోయింది. తడిసిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని, వర్షానికి కొట్టుకు పోయిన ధాన్యానికి నష్ట పరిహారం ఇచ్చి ఆదుకోవాలని అన్నదాతలు విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచి పోయి పలు గ్రామాలు చీకటిలో మగ్గాయి. రాంపూర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో వ్యవసాయ క్షేత్రాల వద్ద నాలుగు చోట్ల 12 కేవీ విద్యుత్ వైర్లు తెగిపోయాయి. కురుస్తున్న వర్షాన్ని లెక్క చేయకుండా విద్యుత్ లైన్ మెన్ దుబ్బుడు సంపత్ రెడ్డి, అసిస్టెంట్ లైన్ మెన్ పడిగే శ్రీనివాస్, విద్యుత్ హెల్పర్ ఆరుట్ల శ్రీనివాస రెడ్డి లు రాత్రి చిమ్మ చీకట్లో వ్యవసాయ క్షేత్రాలు తిరిగి తెగిన తీగలను గుర్తించారు. రాత్రి మూడు గంటల సమయంలో తీగలను అతికి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు.





